Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 245 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 12 - 5 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం భేటీ.. పోలవరంపై కీలక చర్చలు




**ఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటున్నారు. అలాగే, పలువురు కేంద్రమంత్రులను కలిసి ఏపీకి సంబంధించిన అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చర్చిస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. పోలవరం ప్రాజెక్టులో కీలకమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు.

**గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేసేలా చర్యలు..**

2027 గోదావరి పుష్కరాల్లోపు ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు. తొలిదశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే తాను స్వయంగా ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 2026 ఏప్రిల్ 2వ తేదీ నాటికి కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని, గ్యాప్ 1, గ్యాప్ 2లలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి..**

ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉందనే కారణంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. దీనివల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దాని కంటే కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినట్లు వివరించారు. ప్రస్తుతం కుడి కాలువ 95 శాతం మేర.. ఎడమ కాలువ పనులు 78 శాతం మేర పూర్తి అయ్యాయని తెలిపారు. కాలువల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీయింబర్స్ చేయాలని జలశక్తి శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు.

**నిధులు మంజూరు చేయాలి..**

పోలవరం ప్రాజెక్టు తదుపరి పనులకు సంబంధించి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి సించాయి యోజన కింద ఏపీలోని వివిధ పథకాల పునరుద్ధరణ, ఆధునికీకరణకు నిధులు మంజూరు కోరుతూ లేఖ ఇచ్చారు. హర్ ఖేత్ కో పానీ కార్యక్రమంలో భాగంగా చెరువులు, కుంటల మరమ్మతులు, పునరుద్ధరణ, ఆధునికీకరణ, కాలువల పూడికతీత, గట్ల బలోపేతం లాంటి పనులు చేయాల్సి ఉందన్నారు. ఏపీ వ్యాప్తంగా 297 నీటి వనరుల పునరుద్ధరణ కోసం రూ.285 కోట్ల నిధులను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ ఆలమట్టి ఎత్తు పెంచే అంశంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయొద్దని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు.

**ఆ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలి..**

ఆనకట్ట ఎత్తును 519.60 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచితే ఏపీ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని.. ఎలాంటి సాంకేతిక, పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయొద్దని సీఎం చంద్రబాబు సూచించారు. అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ ఫేజ్-3 కింద భూసేకరణ ఇతర సన్నాహక పనులు చేయకుండా కర్ణాటకను ఆదేశించాలని, సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ యథాతథ స్థితిని కొనసాగించాలని కోరారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల దాహార్తిని తీర్చే పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. గోదావరి నుంచి సముద్రంలోకి వృథాగా పోయే 200 టీఎంసీల వరద జలాలను మళ్లించేలా పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నట్లు వెల్లడించారు. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పుకొచ్చారు. ఏపీ నీటి అవసరాలకు అనుగుణంగా 8 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనికి అవసరమైన భూసేకరణ కోసం ఒడిశాను ఆదేశించాల్సిందిగా జలశక్తి శాఖ మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు.

## భారతదేశాన్ని ఏ శక్తీ తల వంచేలా చేయలేదు : ప్రధాని మోదీ



**గాంధీనగర్:** చారిత్రక సోమనాథ్ ఆలయం పునర్నిర్మాణం జరిగి 75 వసంతాలయిన సందర్భంగా గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లాలో నిర్వహించిన సోమనాథ్ అమృత్ మహోత్సవ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారంనాడు పాల్గొన్నారు. 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన ప్రఖ్యాత సోమనాథ్ ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి శక్తిమంతమైన సందేశం ఇచ్చారు. పోఖ్రాన్ అణుపరీక్షలను గుర్తు చేస్తూ భారతదేశ దృఢమైన రాజకీయ సంకల్పానికి ఇది ప్రతీక అని చెప్పారు. ప్రపంచంలోని ఏ శక్తీ భారతదేశాన్ని తలవంచేలా కానీ, అణిచి వేయడం కానీ చేయలేదని స్పష్టం చేశారు. 'జాతి ప్రయోజనాలే సుప్రీం. ఎలాంటి ఒత్తిళ్లు మన సంకల్పాన్ని నీరుగార్చలేవు' అని మోదీ పేర్కొన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో భారతదేశం ఎలాంటి అంతర్జాతీయ ఒత్తిళ్లను కూడా లెక్కచేయలేదని, జాతీయ ప్రయోజనాలకే ఎప్పుడూ తొలి ప్రాధ్యానం ఉంటుందని చెప్పారు. సోమనాథ్ ఒక ఆలయం మాత్రమే కాదని దేశ దృఢ సంకల్పానికి ప్రతీక అని అభివర్ణించారు. సర్దార్ పటేల్ విజన్‌ను గుర్తు చేశారు. ధ్వంసం నుంచి నవనిర్మాణం వరకూ సోమనాథ్ జర్నీ చెక్కుచెదరని నాగరికతను ప్రతిబింబిస్తుందని చెప్పారు. సోమనాథ్ అమృత్ పర్వ్ కేవలం ఒక పండుగ కాదని, రాబోయే వెయ్యేళ్లు భారతదేశానికి స్ఫూర్తి అని చెప్పారు. సోమనాథ్ ఆలయంలో వేదమంత్రాల మధ్య అభిషేకం, ధ్వజ పూజ, మహా పూజలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమనాథ్ ఆలయం వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

**మెగా రోడ్ షో**

దీనికి ముందు, ప్రధానమంత్రి హెలిప్యాడ్ నుంచి వీర్ హమీర్జీ సర్కిల్ వరకూ రోడ్‌షోలో పాల్గొన్నారు. సుమారు 1.5 కిలోమీటర్ల మేర జరిగిన ఈ రోడ్‌షోలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. జెండాలు ఊపుతూ, నినాదాలు చేస్తూ సంప్రదాయ నృత్యాలతో దారిపొడవునా ప్రధానికి సాదర స్వాగతం పలికారు. కాగా, సోమనాథ్ ఆలయ ప్రాభవాన్ని గుర్తు చేస్తూ స్మారక స్టాంపు, నాణేన్ని ఈ ఉత్సవాల్లో ప్రధాని విడుదల చేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉపముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వి, తదితర నేతలు ప్రధానిని సన్మానించారు.

## మాజీ సీఎం స్టాలిన్‌ను కలిసిన విజయ్.. తమిళ రాజకీయాల్లో కొత్త చర్చ

**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఓ కొత్త సాంప్రదాయానికి తెర తీశారు. మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఇంటికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కొద్ది నిమిషాల పాటు స్టాలిన్‌తో విజయ్ భేటీ కావడం తమిళనాడులో చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరూ ఏమి మాట్లాడుకున్నారనే విషయం బయటకు రాలేదు. గత ఐదేళ్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా పని చేసిన స్టాలిన్ తాజా ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. ఎన్నికల్లో టీవీకే అత్యధిక స్థానాలు సాధించి అతి పెద్ద పార్టీగా అవతరించింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన బలం టీవీకేకు దక్కలేదు. దీంతో డీఎంకే మిత్ర పక్షాలైన కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే తదితర పార్టీలు, టీవీకేకు మద్దతు ప్రకటించడంతో విజయ్ సీఎం కాగలిగారు. ఈ నేపథ్యంలో స్టాలిన్‌ను విజయ్ కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది



మర్యాదపూర్వక భేటీ మాత్రమే అని టీవీకే ప్రతినిధులు వెల్లడించారు. అయితే స్టాలిన్ చొరవతోనే విజయ్‌కు డీఎంకే మిత్రపక్షాలు మద్దతు ప్రకటించాయని వార్తలు వస్తున్నాయి. ఏదేమైనా స్టాలిన్ ఇంటికి విజయ్ వెళ్లడం మాత్రం తమిళనాట హాట్ టాపిక్‌గా మారింది.

## లక్ష సీసీటీవీ కెమెరాల టార్గెట్.. 70 శాతం సక్సెస్ : హోం మంత్రి అనిత

**కృష్ణా, (రాజధాని వార్తలు):** ఉంగుటూరు మండలం ఆత్కూరులో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ...ఏపీలో గన్నవరం నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. కోటి నలభై లక్షల రూపాయలతో ఆత్కూర్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఇంతకు ముందు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే పెచ్చులు ఊడి మీద పడే పరిస్థితి ఉండేదన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళుతున్నారని చెప్పారు. లక్ష సీసీటీవీ కెమెరాల ఫుటేజ్ టార్గెట్ పెట్టుకొని 70 శాతం సక్సెస్ అయ్యామన్నారు. ఏదైనా నేరం జరిగిందంటే 24 గంటల్లోనే పోలీసులు కేసును ఛేదిస్తున్నారని హోం మంత్రి అనిత తెలిపారు. ఆత్కూరు గ్రామంలో సీసీ రోడ్లను మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు పాల్గొన్నారు. అలాగే ఆత్కూర్




పోలీస్ స్టేషన్‌ను మంత్రులు, ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. స్టేషన్‌లో హోంమంత్రి జ్యోతి ప్రజ్వలన చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సచివాలయాల్లో చోరీ.. ఇంజినీరింగ్ విద్యార్థి అరెస్ట్



**చిత్తూరు, (రాజధాని వార్తలు):** ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై చోరీలకు పాల్పడుతున్న ఇంజినీరింగ్ విద్యార్థి మహేశ్ బాబును చిత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వ సచివాలయాల్లో చోరీలు చేసిన మహేశ్ నుంచి 30 ప్రింటర్లు, 3 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.8,10,400 లక్షలుగా ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. మహేశ్‌పై చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలలో 18 కేసులు నమోదు అయ్యాయి. ఎస్.ఆర్ పురం మండలం కన్యాకాపురం గ్రామానికి చెందిన మహేశ్.. ఆన్‌లైన్ బెట్టింగ్, విలాసవంతమైన జీవనానికి అలవాటు పడినట్లు పోలీసులు తెలిపారు. ఈజీగా డబ్బును సంపాదించడం కోసం దొంగతనాన్ని వృత్తిగా ఎంచుకున్నట్లు చెప్పారు. నిందితుడు ఇంజినీరింగ్ విద్యార్థి అయినప్పటికీ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైనట్లు పోలీసులు చెప్పారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు ప్రభుత్వ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను దొంగిలిస్తూ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మహేశ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

## పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం : సీఎం చంద్రబాబు




**ఢిల్లీ:** పారిశ్రామిక పురోగతిలో సీఐఐది కీలక పాత్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం పారిశ్రామికంగా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలతో లక్ష్యాలు చేరుకోవచ్చని వివరించారు. 1990 నాటి ఆర్థిక సంస్కరణల ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని చెప్పుకొచ్చారు. సోమవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ సుస్థిరమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని మోదీ సూచించారని అన్నారు.




**ప్రపంచంపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం..**


సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. ప్రపంచంపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉందని వెల్లడించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై పడకుండా కేంద్ర ప్రభుత్వం చూసిందని తెలిపారు. ప్రస్తుతం ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు.. క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోందని వివరించారు. వికసిత్ భారత్ దిశగా ముందు కెళ్తున్నామని చెప్పుకొచ్చారు. భారత ఆర్థికవృద్ధి వేగంగా కదులుతోందని అన్నారు. పెట్టుబడులకు స్వర్గధామం ఆంధ్రప్రదేశ్ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి స్వాగతం పలికిన ఎంపీలు. అనంతరం ఎంపీలతో సమావేశమైన సీఎం చంద్రబాబు.

# పక్షుల అద్భుత లోకం: ఈ వేసవిలో మధ్యప్రదేశ్ రెక్కల అద్భుతాలతో కళకళలాడుతుంది



మధ్యప్రదేశ్ అనగానే దట్టమైన అడవులు, గర్జించే పులుల చిత్రాలు వెంటనే మనసులో మెదులుతాయి. కానీ ఈ పులుల రాష్ట్రపు సరిహద్దులకు ఆవల మరో ఉత్సాహభరితమైన ప్రపంచం ఉంది- అది రంగులు, ఈకలు, ఎగిరే రెక్కలు, మధురమైన పక్షుల కిలకిలారావాలతో నిండి, ప్రకృతితో ప్రశాంతతను, అనుబంధాన్ని అందిస్తుంది. తన సరస్సులు, చిత్తడి నేలలు, అడవుల అంతటా, మధ్యప్రదేశ్ వేసవి ప్రయాణాలను ప్రశాంతమైన పక్షుల వీక్షణ అనుభవంగా మారుస్తోంది. 450కి పైగా పక్షి జాతులు నమోదు కావడంతో, ఈ రాష్ట్రం భారతదేశంలోని అత్యంత ఉత్తేజకరమైన పక్షుల వీక్షణ గమ్యస్థానాలలో ఒకటిగా వేగంగా ఎదుగుతోంది. సెంట్రల్ ఏషియన్ ఫ్లైవే మార్గంలో ఉన్న మధ్యప్రదేశ్, ప్రతి శీతాకాలంలో సైబీరియా, మధ్య ఆసియా, ఐరోపా నుండి వేలాది వలస పక్షులకు స్వాగతం పలుకుతుంది. ఈ రెక్కల అతిథులు రాష్ట్రంలోని చిత్తడి నేలలు, జలాశయాలలో విశ్రాంతి తీసుకోవడానికి వేలాది కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. వేసవి సమీపిస్తుండగా, అనేక వలస పక్షులు తమ తిరుగు ప్రయాణాన్ని ప్రారంభిస్తాయి, అదే సమయంలో స్థానిక పక్షి జాతులు అత్యంత చురుకుగా మారతాయి-ఇది పక్షి ప్రేమికులకు పూర్తిగా భిన్నమైన మరియు అంతే అద్భుతమైన అనుభవాన్ని అందిస్తుంది. వేసవి కాలంలో, పక్షి ప్రేమికులు ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్, క్రెస్టెడ్ సర్పెంట్ ఈగిల్, పైడ్ కింగ్‌ఫిషర్, రివర్ టెర్న్ మరియు మలబార్ పైడ్ హార్న్‌బిల్ వంటి అద్భుతమైన జాతులను సులభంగా గుర్తించగలరు. పక్షుల గూళ్ళు కట్టడం, సంతానోత్పత్తి ప్రవర్తన మరియు వాటి సహజ జీవన లయలను దగ్గరగా గమనించడానికి ఈ కాలం అనువైనదిగా పరిగణించబడుతుంది. మధ్యప్రదేశ్‌లో పక్షులను చూడటం అంటే కేవలం పక్షులను గుర్తించడం మాత్రమే కాదు-అది ప్రకృతిలో లీనమవడం. అటావి





బర్డ్ ఫౌండేషన్ వంటి సంస్థలు, గైడెడ్ బర్డ్ వాక్స్ మరియు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలను పరిరక్షణ మరియు పౌర విజ్ఞానంతో అనుసంధానిస్తున్నాయి. బైనాక్యులర్ల జతతో ప్రకృతిని అనుభవించాలనుకునే ఎవరికైనా, మధ్యప్రదేశ్ తన చిత్తడి నేలలు, అడవులు మరియు సరస్సులలో దాగి ఉన్న లెక్కలేనన్ని కథలను అందిస్తుంది.

భోపాల్: సరస్సుల నగరం

భోజ్ వెట్‌ల్యాండ్ (అప్పర్ లేక్), వాన్ విహార్, కెర్వా మరియు కలియాసోట్ కలిసి ఒక అభివృద్ధి చెందుతున్న పట్టణ పక్షి వీక్షణ క్షేత్రాన్ని సృష్టిస్తాయి. ఇక్కడ నగరం యొక్క సహజ పరిసరాల మధ్య బార్-హెడెడ్ గీస్, ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్స్, బ్రౌన్ ఫిష్ అవుల్స్ మరియు రివర్ టెర్న్‌లను చూడవచ్చు.

జబల్‌పూర్: రాతి అరణ్యం & అటవీ పక్షి వీక్షణం

డుమ్నా నేచర్ పార్క్ మరియు నర్రాయ్ అడవులు పక్షి వీక్షకులకు ఒక స్వర్గం. ఇక్కడ రాకెట్-టెయిల్డ్ డ్రోంగో, ఈజిప్షియన్ వల్చర్ మరియు ఇండియన్ రోలర్ వంటి పక్షులను చూడవచ్చు.

ఇండోర్: చిత్తడి నేలలు & పక్షుల సౌందర్యం

గులావత్‌లోని లోటస్ వ్యాలీ మరియు తలవాలి చందా, పైడ్ కింగ్‌ఫిషర్, వూలీ-నెక్డ్ స్టోర్క్ మరియు రెడ్ అవడావత్ వంటి రంగురంగుల జాతులతో కళకళలాడుతుంటాయి. అదే సమయంలో, సిర్‌పూర్ సరస్సు (ఒక రామ్‌సర్ సైట్) మరియు యశ్వంత్ సాగర్, సైబీరియా, రష్యా, మంగోలియా మరియు మధ్య ఆసియా నుండి వచ్చే వేలాది వలస పక్షులకు ముఖ్యమైన ఆవాసాలుగా పనిచేస్తున్నాయి.

నార్సింగ్‌గఢ్ & ఖేయోని: దాగి వున్న పక్షి వీక్షణ ప్రదేశాలు

దట్టమైన అడవులతో నిండి, పర్యాటకుల రద్దీ తక్కువగా ఉండే ఈ ప్రశాంతమైన అభయారణ్యాలు, వూలీ-నెక్డ్ స్టోర్క్, బ్లాక్-వింగ్డ్ కైట్ మరియు యూరేషియన్ హూపో వంటి జాతులకు ప్రసిద్ధి చెందాయి.

సత్పురా & పన్నా: వన్యప్రాంతాలు

సత్పురాలోని వాకింగ్ సఫారీలు మరియు పన్నా జాతీయ ఉద్యానవనంలోని అద్భుతమైన నదీతీరాలు మరపురాని పక్షి వీక్షణ అనుభవాలను అందిస్తాయి. వీటిలో మలబార్ పైడ్ హార్న్‌బిల్, ఇండియన్ స్కిమ్మర్ వంటి పక్షులను చూడటంతో పాటు, కెన్ నది కొండల వెంబడి గూళ్ళు కట్టుకునే రాబందులను కూడా చూడవచ్చు.

గ్వాలియర్: క్యాంపస్ బర్డింగ్

జీవాజీ విశ్వవిద్యాలయం యొక్క పచ్చని ప్రాంగణం, పర్పుల్ సన్‌బర్డ్ మరియు ఏషియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్ వంటి జాతులకు సురక్షితమైన ఆశ్రయంగా మారింది. అతావి బర్డ్ ఫౌండేషన్, మధ్యప్రదేశ్ టూరిజం బోర్డ్ సహకారంతో, స్థానిక నివాసితులకు బర్డ్ గైడ్‌లుగా మరియు ప్రకృతి శాస్త్రవేత్తలుగా శిక్షణ ఇవ్వడం ద్వారా స్థానిక సమాజాలను శక్తివంతం చేస్తూ, పరిరక్షణ మరియు బాధ్యతాయుత పర్యాటకం రెండింటినీ ప్రోత్సహిస్తోంది. బర్డ్ వాక్స్‌లో చేరడానికి ఆసక్తి ఉన్నవారు వీరుదీ వెబ్‌సైట్ మరియు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో నమోదు వివరాలను కనుగొనవచ్చు. ఈ వేసవిలో, విభిన్నమైనదాన్ని ఎంచుకోండి-రద్దీగా ఉండే హిల్ స్టేషన్‌లకు దూరంగా అడుగుపెట్టి, పక్షుల కిలకిలరావాలు మరియు ప్రకృతితో ప్రశాంతమైన ఉదయాలను గడపండి. మధ్యప్రదేశ్‌కు రండి, ప్రకృతి రెక్కలతో విహరించండి-ఇక్కడ ప్రతి పక్షి కిలకిలారావం ఒక కథను చెబుతుంది.

## మదర్స్ డే సందర్భంగా కేపీహెచ్‌బీలో ఉచిత వైద్య శిబిరం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ కేపీహెచ్‌బీ కాలనీలో మాతృ దినోత్సవం సందర్భంగా భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బ్రహ్మోస్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, కేపీహెచ్‌బీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మెడికల్ క్యాంప్‌లో ప్రముఖ వైద్యులు పాల్గొని వృద్ధులకు, పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఉచిత మందులతో పాటు ఎముకల సాంద్రత పరీక్షలు కూడా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదర్స్ డే సందర్భంగా ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులకు మరియు పేదలకు ఆరోగ్య సేవలు చేరువ చేయాలనే సత్సంకల్పంతో నెల్లూరు కేపీహెచ్‌బీ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బ్రహ్మోస్ చారిటబుల్ ట్రస్ట్ మరియు కేపీహెచ్‌బీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సామాజిక సేవా కార్యక్రమంలో అపోలో ఆసుపత్రికి చెందిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ దివాకర్ రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మౌనిక పాల్గొని రోగులకు విశేష సేవలు అందించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ టి.మౌనిక, జనరల్ ఫిజీషియన్ పివి దివాకర్ రెడ్డి, ప్రభాస్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాలాజు నాగమణి. ఖూఎదీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రతాప్, సెక్రెటరీ నాగభూషణం, లేడీస్ సెక్రెటరీ లలితా భాయి చక్ర, జాయింట్ సెక్రెటరీ హరిహర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పంచారామంలో యనమల ప్రత్యేక పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో మాజీ శాసన మండలి సభ్యులు యనమల రామకృష్ణుడు ప్రత్యేక పూజలు చేపట్టారు. శనివారం ఆలయానికి చేరుకున్న రామకృష్ణుడు భీమేశ్వర స్వామిని, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి నంది మండపం ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ అధికారి బళ్ల నీలకంఠం వారికి స్వామి వారి ప్రసాదము, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చీమల కొండ వీరభద్ర ప్రసాదరావు, తాతపూడి సత్య అరుణ్ వంశీ, గొర్తి సత్యనారాయణ, తాతపూడి పవన్ కుమార్, అలోక్ చంద్ర జైన్, కంచర్ల సుష్మ మోహిని, కొండపల్లి సత్యవాణి, మందపల్లి భాను వెంకట పద్మ, బాడితిమాని లక్ష్మి, గోనిపాటి బుల్లమ్మ, కూటమి నాయకులు దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి హయాంలో ట్రూ అప్ కూటమి హయాంలో ట్రూ డౌన్

### - మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు భవిష్యత్తులో పెంచబోమని, ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ట్రూ ఆఫ్ చార్జీలు పెంచకుండా, జగన్ రెడ్డి వైసీపీ పాలనలో తొమ్మిది సార్లు పెంచిన విద్యుత్ చార్జీలు 72 వేల కోట్ల రూపాయలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ట్రూ డౌన్ పేరుతో విద్యుత్ చార్జీలను తగ్గించడం వల్ల వినియోగదారుల్లో ఆనందం వ్యక్తపరుస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యలను కొనియాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను ప్రతినెల ప్రభుత్వం సబ్సిడీతో పాటు జగన్ రెడ్డి పెంచిన చార్జీలను తగ్గిస్తూ రావడం వల్ల ఈరోజున యూనిట్‌కి 13 పైసలు తగ్గించడం వల్ల వినియోగదారులకు ప్రతినెలా వచ్చే 800 బిల్లు ఇప్పుడు 400 వస్తుందని మా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేయడంతో విద్యుత్ వినియోగదారులు బహిరంగంగా మా విద్యుత్ బిల్లు గతంలో కంటే చాలా తక్కువ వస్తుందని ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారని నాగ జగదీష్ అన్నారు. విద్యుత్ రంగాన్ని గాడిని పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్నా చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా చేసిన విద్యుత్ కొనుగోలులో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కట్టడి చేసిందని, ఫలితంగా వైసిపి హయాంలో సగటున యూనిట్ ధర 5.45 పైసాల వరకు ఉండగా దాన్ని రూ.4.90 కి తగ్గించ గలిగారని, ఒక యూనిట్ పై 55 పైసలు వరకు మిగలడంతో ఏడాదిలో సుమారు రూ.4,398 కోట్లు ఆదా చేయ గలిగారని, దీని మూలంగా ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు ట్రూ డౌన్‌తో యూనిట్‌కి 13 పైసలు చొప్పున తగ్గించడంతో విద్యుత్తు వినియోగించే వినియోగదారులకు ఉపశమనం కలిగిందని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి గడపకు పూసిన పసుపు పారాణి అమ్మ



**విజయనగరం, (రాజధాని వార్తలు):** తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గీతాంజలి పాఠశాలలో అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గురు ప్రసాద్ మాట్లాడుతూ గాయత్రిని మించిన మంత్రం లేదని, తల్లిని మించిన దైవం లేదని ఇంటి గడపకు పూసిన పవిత్ర పసుపు పారాణి వంటిది అమ్మ అని అభివర్ణించారు. కార్యక్రమాన్ని ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త పులిపాటి రామారావు జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించగా, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న హైందవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అమ్మ అంటే దైవ సమానమని, అమ్మ ప్రేమకు ప్రత్యామ్నాయం లేదని అన్నారు. ప్రముఖ న్యాయవాది నాలుగెస్సులరాజు, ఫూల్ బాగ్ జిల్లా పరిషత్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు దశగ్రంథాల వెంకట సుబ్రహ్మణ్యం ప్రధాన వక్తలుగా హాజరై మాతృమర్తి ప్రాధాన్యతను వివరించారు. ఈ సమావేశంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బోండా రమేష్, ఉత్తరాంధ్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి, జిల్లాశాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు గిరిజా ప్రసన్న, వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి, శ్రీ వాసవీ ఆర్యవైశ్య సేవాసంఘం కంటోన్మెంట్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు డిమ్సరాజు, బత్తుల కామేష్, కోశాధికారి ముత్తా మల్లికార్జునరావు, విశ్వసాహితీవేదిక అధ్యక్షురాలు భోగరాజు సూర్యలక్ష్మీ, న్యాయవాది దాసరి పద్మ, పాఠశాల కరస్పాండెంట్ ఎ శ్రీనివాసరావు, డైరక్టర్ రాజేష్, ప్రిన్సిపాల్ మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

# టెక్నాలజీ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతున్నాం : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలు, ఇన్నోవేటర్లు, యువతకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. పోఖ్రాన్ విజయంతో భారతదేశ సాంకేతిక సామర్థ్యం ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. జ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణల ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు.

**టెక్నాలజీ ఆధారిత అభివృద్ధే లక్ష్యం**

భవిష్యత్తు టెక్నాలజీల కోసం ఆంధ్రప్రదేశ్‌లో బలమైన ఎకోసిస్టమ్ నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతను ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దేందుకు భారీ స్థాయిలో డీప్‌టెక్ స్కిల్లింగ్ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో IBM SkillsBuild, APSCHE, APSSDC, Quantum Valley భాగస్వామ్యంగా పనిచేస్తున్నాయని వివరించారు.

**ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ**

రాష్ట్ర యువతకు క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాల్లో శిక్షణ అందించనున్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. 2026–27 నాటికి రెండు లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని 10 లక్షల మందికి విస్తరించే ప్రణాళికను రూపొందిస్తున్నామని అన్నారు. డిజిటల్ లెర్నింగ్, ఇండస్ట్రీ ట్రైనింగ్, గ్లోబల్ సర్టిఫికేషన్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు.

**ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఇన్నోవేషన్ సెంటర్**

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో NIELIT Innovation, Skilling Centre ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కేంద్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, సెమీకం డక్టర్ టెక్నాలజీలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులకు వరల్డ్ క్లాస్ ల్యాబ్స్ అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలిపారు.

**NPTEL పరీక్షల్లో ఏపీ విద్యార్థుల ప్రతిభ..**

NPTEL జాతీయ పరీక్షల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు 4 గోల్డ్, 14 సిల్వర్ మెడల్స్ సాధించడం రాష్ట్ర ప్రతిభకు నిదర్శనమని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ఆధునిక టెక్నాలజీ కోర్సుల్లో మరింత మంది విద్యార్థులు పాల్గొని ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

**క్వాంటమ్ వ్యాలీ విజన్‌తో ముందుకు ఏపీ..**

క్వాంటమ్ వ్యాలీ విజన్ ద్వారా భవిష్యత్ టెక్నాలజీలకు సిద్ధమయ్యే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రపంచ స్థాయి పరిశోధన, సాంకేతిక నైపుణ్యాలు, స్టార్టప్ అవకాశాలు, ఇండస్ట్రీ కనెక్టివిటీతో ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర యువతలో నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ప్రపంచ మార్కెట్ అవసరాలకు తగిన మానవ వనరులను తయారు చేయాలని తమ ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# రెండు సంవత్సరాలుగా గర్భిణీలకు సేవలు





**అమరావతి, (రాజధాని వార్తలు):** రెండు సంవత్సరాలగా గర్భిణీల సేవలో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు మరువలేనివని తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు అన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం 75 తాళ్లూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోగులపాటి రమాదేవి, రాజు దంపతుల సహకారంతో గర్భిణీలకు వారి సహాయకులకు భోజనంతోపాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈసం దర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్న సంకల్పంతో గర్భిణీలకు రెండు సంవత్సరాల నుండి పోషకాహారాన్ని అందిస్తున్న జన చైతన్య సమితి నిర్వాహకులు అభినందనీయులని అన్నారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందించటానికి మంచి మనసుతో ముందుకు వచ్చిన గోగులపాటి రాజు కుటుంబ సభ్యులు ఆదర్శనీయులని అన్నారు. రాజు మాట్లాడుతూ సామాజిక సేవలో జనచైతన్య సమితి దశాబ్దాల కాలంగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు దాసరి విజయ్ బెన్నిబాబు, కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, వాకా ప్రవీణ్ కుమార్, అందే నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. భోజనంతో పాటు కోడిగుడ్లు, యాపిల్ కాయలు, దానిమ్మకాయలు, అరటి పండ్లు, డ్రైఫ్రూట్ లడ్లు, కొబ్బరితో తయారు చేసిన ఉండలు, ఖర్జూర పళ్ళు వేరుశనగ విత్తనాలతో తయారు చేసిన వేరుశనగ ఉండలను పంపిణీ చేశారు.

# ప్రజల సానుకూల అభిప్రాయం 75.9 శాతంతో పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానం

**భీమవరం, (రాజధాని వార్తలు):** అమరావతి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన రెండు రోజులపాటు నిర్వహిస్తున్న కలెక్టర్ల సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించడంతో పాటు వివిధ జిల్లాల పనితీరుపై చర్చ జరిగింది. గత కలెక్టర్ల సదస్సు – తృతీయ త్రైమాసికం (డిసెంబర్ 2025 – ఫిబ్రవరి 2026)లో పశ్చిమగోదావరి జిల్లా 73.9 శాతం స్కోరు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవగా, ప్రస్తుత కలెక్టర్ల సదస్సు – నాల్గవ త్రైమాసికం (మార్చి 2026 – ఏప్రిల్ 2026)లో 75.9 శాతం స్కోరు సాధించి గత త్రైమాసికంతో పోలిస్తే 2.0 శాతం పురోగతి నమోదు చేసింది. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయ సేకరణ నిర్వహించగా, పశ్చిమగోదావరి జిల్లా 75.9 శాతం ప్రజల సానుకూల అభిప్రాయం నమోదు చేసుకుని రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచింది. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై మొత్తం 35 అంశాలపై ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే నిర్వహించారు. ప్రజలు ఇచ్చిన అభిప్రాయాల ఆధారంగా జిల్లాకు అత్యుత్తమ ఫలితాలు నమోదయ్యాయి. ఈ సర్వేలో ముఖ్యంగా అన్నా క్యాంటీన్ల నిర్వహణ, ఏపీఎస్ఆర్టీసీ సేవల మెరుగుదల, మహిళలపై నేరాల నియంత్రణ చర్యలు, దీపం–2 పథకం అమలు, ఎఫ్–లైన్ సేవలు, విద్యుత్ సరఫరా సేవలు, గంజాయి నియంత్రణ చర్యలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు అందిస్తున్న వైద్య సేవలు, గృహ నిర్మాణ కార్యక్రమాలు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, పంచాయతీ స్థాయిలో అందుతున్న సేవలు, ఆర్ అండ్ ఎస్ రిజిస్ట్రేషన్లు, చౌక ధరల దుకాణాల ద్వారా వస్తువుల పంపిణీ, ఆర్ఓఆర్ సర్వే, పారిశుధ్య నిర్వహణ, దేవాలయ సేవలు తదితర అంశాల్లో జిల్లా మెరుగైన పనితీరును ప్రదర్శించింది.

ప్రత్యేకంగా SAAP కార్యక్రమంలో 14.0 నుంచి 52.5కి పెరిగి 38.5 శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. అదేవిధంగా VAHAN సేవలు 14.1 శాతం, SARATHI సేవలు 10.7 శాతం, రవాణా శాఖ పన్ను సేవలు 9.5 శాతం, గుంతల నివారణ 6.6 శాతం, BCW వసతి గృహాలు 5.8 శాతం, ఆసుపత్రి సేవలు 5.1 శాతం, రేషన్ పంపిణీ 5.0 శాతం మెరుగుదల సాధించాయి. విద్యా రంగంలో కూడా మంచి పురోగతి కనిపించింది. పాఠశాల విద్య 86.6 శాతానికి చేరుకోగా, కళాశాల విద్య 3.7 శాతం వృద్ధి నమోదు చేసింది. అన్న క్యాంటీన్లు, SGSW, ROR సర్వే, గంజాయి నియంత్రణ చర్యలు, APSRTC సేవలు తదితర అంశాల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించబడ్డాయి. ఇక కొన్ని అంశాల్లో స్వల్ప తగ్గుదల కనిపించింది. ముఖ్యంగా గృహ నిర్మాణ పథకంలో 6.6 శాతం, F–లైన్ సర్వేలో 5.0 శాతం తగ్గుదల నమోదైంది. అలాగే పంచాయతీ సేవలు – SWM, SW వసతి గృహాలు, దీపం–2, పారిశుధ్యం – MAUD, వీధి దీపాలు/తాగునీరు, పిల్లలు (6–36 నెలలు) వంటి అంశాల్లో స్వల్ప తగ్గుదల కనిపించింది. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయడం, తెలిపారు.

# ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

**- మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు**




**మెదక్ జిల్లా, (రాజధాని వార్తలు):** చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో అదనపు కలెక్టర్ నగేష్, వ్యవసాయ, సివిల్ సప్లై, మార్కెటింగ్, ట్రాన్స్పోర్ట్, రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. ధాన్యం చివరి గింజలకు కొనాలని, ధాన్యం తరలింపు ప్రక్రియలో ఆలస్యం అవుతుందని, రైస్ మిల్లులో హమాలీల సమస్యను పరిష్కరించుకోవాలని, ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారు తెలుపాలని అధికారులపై ఆగ్రహించారు. రైతులు ధాన్యం తరలింపు పై రోడ్లపైకి వచ్చిన సంఘటన, ధర్నాలు చేసిన విధానం, రైతు పెట్రోల్ బాటిల్‌తో రోడ్ల పైకి వచ్చారు ఇలాంటి సంఘటనకు ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేయాలన్నారు. తమది రైతు ప్రభుత్వమని, రైతు సమస్యలపై తప్పకుండా గళం ఎత్తుతామన్నారు. ముఖ్యమంత్రి ,మంత్రులు 24 గంటలు రైతుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నట్లు వివరించారు. తాను ప్రజలు, రైతులు ఎన్నుకుంటే వచ్చానని వారి కోసం ఎవరినైనా ప్రశ్నిస్తానన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలును స్పీడ్ అప్ చేయాలని అధికారులు ఆదేశించారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ సజావుగా నిర్వహిస్తామని, హమాలీల సమస్యను పరిష్కరిస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపడతామన్నారు. నాలుగైదు రోజుల్లో మరింత స్పీడ్ అప్ చేసి రైస్ మిల్లుల వద్ద అన్ లోడింగ్ ప్రక్రియను సైతం త్వరిత గతిన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాధికా భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల కర్ణాటక గెస్ట్ హౌస్‌లో వసూళ్ల పర్వం.. టీటీడీ ఈవో సీరియస్!

**- ఒక ఫంక్షన్‌కు రూ. 50 లక్షల వసూలు? : విచారణకు ఆదేశించిన ఈవో రవిచంద్ర**



**తిరుపతి, (రాజధాని వార్తలు):** కలియుగ వైకుంఠం తిరుమలలోని కర్ణాటక గెస్ట్ హౌస్‌లో భారీ స్థాయిలో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలపై టీటీడీ అత్యవసర విచారణకు ఆదేశించింది. పవిత్రమైన పుణ్యక్షేత్రంలో బస చేసే భక్తుల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై టీటీడీ ఈవో రవిచంద్ర తీవ్రంగా స్పందించారు. కర్ణాటక గెస్ట్ హౌస్‌లో నిర్వహించే ఒక్కో ఫంక్షన్‌కు అక్కడ పనిచేసే కొందరు సిబ్బంది సుమారు 50 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని టీటీడీకి ఫిర్యాదులు అందాయి. తాజాగా ఒక భక్తురాలు స్వయంగా రంగంలోకి దిగి అక్కడ జరుగుతున్న అక్రమ వసూళ్లను ఎండగట్టడం సంచలనం రేపింది. సామాన్య భక్తులకు అందుబాటులో ఉండాల్సిన వసతి సౌకర్యాలను వ్యాపారంగా మార్చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ఈవో రవిచంద్ర, తక్షణమే అత్యవసర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు గత కొన్ని సంవత్సరాలుగా గెస్ట్ హౌస్‌లో జరిగిన ఆర్థిక లావాదేవీలు, బుకింగ్‌ల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎవరెవరు వస్తున్నారు? లావాదేవీలు ఎక్కడ జరుగుతున్నాయి? అనే విషయాలను నిర్ధారించడానికి గత కొన్నేళ్ల సీసీ కెమెరాల దృశ్యాలను విశ్లేషించనున్నారు. ఈ అక్రమాల్లో ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ వర్గాలు వెల్లడించాయి. తిరుమల పవిత్రతను దెబ్బతీస్తూ, భక్తులను ఇబ్బందులకు గురిచేసే ఏ శక్తినైనా సహించబోమని యంత్రాంగం స్పష్టం చేస్తోంది. కర్ణాటక గెస్ట్ హౌస్ వ్యవహారంలో జరుగుతున్న ఈ విచారణ ఇప్పుడు తిరుమలలో హాట్ టాపిక్‌గా మారింది.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం : యల్లటూరు



**రాజంపేట, (రాజధాని వార్తలు):** స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సిద్ధంగా ఉన్నట్లు రాజంపేట జనసేన పార్టీ పార్లమెంటు ఇంచార్జి యల్లటూరు శ్రీనివాసరాజు తెలియజేశారు. తిరుపతి కేంద్రంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల జనసేన పార్టీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలు, డీ లిమిటేషన్ ప్రక్రియపై ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆరని శ్రీనివాసులు, టి.సి.వరుణ్‌ల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు పాల్గొని స్థానిక సంస్థ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని, రాజంపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ బలంగా ఉందని, అభ్యర్థుల గెలుపు కోసం నిరంతరాయంగా పనిచేసి గెలిపించుకుంటామని సభాముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మద్దిరేవుల ఈడిగపల్లి లో మోటర్ చెడిపోయి త్రాగునీటికి కటకట



**లక్కిరెడ్డిపల్లి, (రాజధాని వార్తలు):** మండలంలోని మద్దిరేవుల గ్రామ సచివాలయం పరిధిలోని ఈడిగపల్లిలో త్రాగునీరు మోటర్ చెడిపోయి వారం రోజులు అయినది. దీంతో త్రాగునీటికి ఇబ్బంది ఏర్పడింది. జీవాలు, ప్రజలు ఇబ్బందులను పట్టించుకొనే నాధుడే కరువయ్యారు. గ్రామ సెక్రటరీని అడుగుదామని ఆయన దృష్టికి తీసుకెళదామంటే సచివాలయానికి రాకుండా లక్కిరెడ్డిపల్లి లోని అన్ని గ్రామ పంచాయతీల సేవలు చేయడానికి అంకితం అయ్యాడని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో త్రాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న అధికార పార్టీ గ్రామ నాయకులకు చెపుదామన్న ఫోన్ తీయకుండా కాలం గడుపుతున్న వైనం. త్రాగునీటి కష్టాల ఎవరికి చెప్పుకోవాలి అని మహిళలు అంటున్నారు. ఉన్న మోటర్ చెడిపోయింది మరొక మోటర్ ఉన్న అందులోని త్రాగునీరు సరిపోవటలేదని గంటల తరబడి మండుటెండలో ఉన్నా నీరు రావడం లేదని గ్రామస్థులు అంటున్నారు. బోరులో నీరు సరిపడా ఉన్నప్పటికీ మోటర్ తయారు చేయించే వారు లేరని గతంలో ఎప్పుడూ ఇలాంటి త్రాగునీరు వెతలు చూడలేదని వారు పేర్కొన్నారు. అదేవిధంగా జి ఎం ఆర్ కాలనీ లో కూడా మోటర్ చెడిపోయి త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్థులు చెబుతున్నారు. మాజీ సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ దృష్టికి విషయం తెలుపగా గతంలో నెహ్రూ నగర్, ఈడిగపల్లిలో కొత్తగా మోటర్లు బిగించి త్రాగునీరు సరఫరా చేసినా మిగతా గ్రామాలలో కూడా మోటర్లు తయారు చేయించి త్రాగునీరు వెతలు తీర్చిన పంచాయతీ అధికారులు ఇప్పటికీ త్రాగునీటి బిల్లులు చెల్లించలేదని జిల్లా అధికారులు, అధికారపార్టీ నాయకులు బిల్లులు నిలుపుదల చేయనున్నారని మండల అధికారిని, గ్రామ సెక్రెటరీ వారిపై సాకులు చెబుతున్నారని ఆవేదన ఆమె వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాలలో త్రాగునీటి ఇబ్బందులు ఎప్పుడూ ప్రజలు ఎదుర్కోలేదని అన్నారు. కరోనా సమయంలోనూ ప్రజల ఇబ్బందులు తీర్చామని, త్రాగునీటి కష్టాల బారినా పడకుండా ఆదు కున్నామన్నారు. పంచాయతీ అధికారులు చొరవ చూపి త్రాగునీటి మోటర్ రిపేర్లు చేయాలని ఆదేశిస్తే ఇప్పటికైనా నా వంతుగా త్రాగునీటి సరఫరా ప్రజలకు అందించుటకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో నిధులు ఉన్నా పాత బిల్లులు చెల్లించకుండా అధికారులు జాప్యం చేయడం ఎంతవరకు సమంజసం అని విమర్శించారు. ఇంత జరుగుతున్న గ్రామ అధికారులు గ్రామ సచివాలయానికి రాకుంటే నేను ఎవరిని సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

# సంపాదకీయం

## అంకెల వలయంలో శ్రామికుడు!

మన కాలంలో అత్యంత భయంకరమైన అబద్ధాలు అందమైన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ల రూపంలోను, రంగురంగుల చార్టులు, నివేదికల రూపంలోను వస్తాయి. ఆధునిక సామ్రాజ్యవాదం ఇప్పుడు దేశాలను ఆక్రమించడం లేదు, అది నేరుగా మనుషుల శ్రమనూ, వారి జీవించే హక్కును ఆక్రమిస్తోంది. ఈ వ్యవస్థీకృత హింసను కప్పిపుచ్చడానికి కార్పొరేట్ శక్తులు ఎంచుకున్న తాజా ఆయుధమే ఇటీవలి 'వర్క్ ఇండియా' నివేదిక. ఈ నివేదికను పైపైన చూస్తే, భారతదేశంలో శ్రామికవర్గం పాలు తేనెల్లో తేలియాడుతున్నట్లు, వారి జీవితాల్లో ఏదో అద్భుతమైన స్వర్ణయుగం నడుస్తున్నట్లు అనిపిస్తుంది. బ్లూ కాలర్ కార్మికులు వైట్ కాలర్ ఉద్యోగుల కంటే వేగంగా ఎదుగుతున్నారని, వారి జీతాలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఒక అద్భుతమైన భ్రమను అల్లుతుంది. కానీ, ఈ అంకెల తెరను చీల్చి చూస్తే అక్కడ కనిపించేది అభివృద్ధి కాదు, దశాబ్దాలుగా రక్తం చిందించి కార్మికులు సాధించుకున్న హక్కులపై ముప్పేట దాడి. వర్క్ ఇండియా నివేదిక యాజమాన్యాల ప్రయోజనాల కోసం పకడ్బందీగా అల్లిన ఒక కార్పొరేట్ కుట్ర. గణాంకాల గారడీ, ఆకలిని కప్పిపుచ్చే అంకెల అబద్ధం. ఈ నివేదిక ప్రకారం, 2024లో బ్లూ కాలర్ కార్మికుల సగటు వేతనం నెలకు రూ.14,056 ఉంటే, 2025 నాటికి అది 8.6శాతం పెరిగి రూ.15,265కు చేరిందట. కాగితాల మీద ఈ 8.6 శాతం అనేది ఒక అద్భుతమైన వృద్ధి లాగా కనిపిస్తుంది. కానీ ఈ దేశంలో వీధి అంచున నిలబడి బతుకు పోరాటం చేసే సగటు మనిషిని అడిగితేనే, ఈ రూ.1,200 పెరుగుదల వాస్తవానికి ఒక పెంపా లేక అవమానమా అనేది అర్థమవుతుంది. మార్కెట్‌లో నిశ్శబ్దంగా తిరుగుతూ పేదవాడి కంచంలోని ముద్దను ఎత్తుకుపోయే 'ద్రవ్యోల్బణం' అనే రాక్షసుడి గురించి ఈ నివేదిక ఎందుకు మాట్లాడదు? పెట్రోల్ ధరలు, కూరగాయల ధరలు, కరెంటు బిల్లులు, ఇంటి అద్దెలు ఇరవై ముప్పై శాతాలు పెరుగుతున్నప్పుడు, ఈ ఎనిమిది శాతం జీతం పెంపు అనేది కార్మికుడి కడుపు నింపుతుందా, లేక వాడిని మరింత అప్పుల ఊబిలోకి నెడుతుందా? జాతీయ లేబర్ వేజెస్ కమిషన్ స్వయంగా ఒక సెమీ-స్కిల్డ్ వర్కర్‌కు నెలకు కనీసం రూ.30,000 (రోజుకు రూ. 1,000) వేతనం ఉండాలని ఘోషిస్తుంటే, కార్పొరేట్ రాబందులు మాత్రం రూ. 15,265 ఇచ్చి, అదేదో మహాభాగ్యం అన్నట్లు నివేదికలు వండివార్చడం వారి అహంకారానికి, శ్రమ దోపిడీకి పరాకాష్ఠ. నిజమైన వృద్ధి అనేది మార్కెట్ ధరలకు అనుగుణంగా ఉండాలి, దాని ప్రకారమైతే ఇక్కడ కార్మికుడి జీవితం పాతాళానికి దిగజారుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎప్పుడూ ఒక పాత వ్యూహం ఉంటుంది. "బాధితులను ఒకరిపై ఒకరిని ఉసిగొల్పు, అప్పుడు వారు అసలు దోపిడీదారుడిని ప్రశ్నించరు." వైట్ కాలర్, బ్లూ కాలర్ ఉద్యోగుల జీతాలను పోల్చడం వెనుక ఉన్న కుట్ర ఇదే. వైట్ కాలర్ ఉద్యోగికి (అడ్మినిస్ట్రేషన్ సపోర్ట్) కనీసం బేసిక్ జీతంతో పాటు ప్రతి ఏటా పెరిగే డీఏ, టీఏ వంటి రక్షణ కవచాలు ఉంటాయి. కానీ అగ్నిగుండంలాంటి ఫ్యాక్టరీలో, ఎండలో కరిగే బ్లూ కాలర్ కార్మికుడికి దక్కేది కేవలం ఆ కనీస వేతనం మాత్రమే. ఈ రెండు వర్గాలను పోల్చి, "చూడండి ఏసీ గదుల్లో ఉండే వైట్ కాలర్ ఉద్యోగుల కంటే బ్లూ కాలర్ కార్మికులకే జీతాలు ఎక్కువగా పెరుగుతున్నాయి" అని ప్రచారం చేయడం ఒక పచ్చి అబద్ధం. సమాజంలో కార్మికుల పట్ల ఉండే సానుభూతిని చంపేసి, "వారికి అన్నీ అందుతున్నాయి, వారు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు" అనే ఒక తప్పుడు నెరేటివ్‌ను ప్రజల మెదళ్లలో నాటడానికే ఈ తరహా నివేదికలు వెలువడుతూంటాయి. ఈ నివేదికలు ఎందుకు ఇప్పుడే పుట్టుకొస్తున్నాయి? కార్మికులు శతాబ్ద కాలంగా రక్తం, కన్నీరు చిందించి, లాఠీ దెబ్బలు తిని సాధించుకున్న 29 చట్టాలను చెత్తబుట్టలో వేసి, కేవలం నాలుగు 'లేబర్ కోడ్స్'ను ప్రభుత్వాలు అమలు చేయబోతున్నాయి. ఈ కోడ్స్ అన్నీ యాజమాన్యాల దోపిడీని చట్టబద్ధం చేసేవే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ముసుగులో జరుగుతున్న ఈజ్ ఆఫ్ ఎక్స్‌ప్లాయిటింగ్ హ్యూమన్స్ (మనుషులను దోచుకునే వెసులుబాటు) ఇది. క్రూరమైన నాలుగు లేబర్ కోడ్స్‌కు సామాజిక మద్దతును కూడగట్టడానికే ఇలా కార్మికుల జీతాలపై అక్కసు వెళ్లగక్కుతూ నివేదికలు ఇప్పిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు మానవత్వం ఉండదు, దానికి తెలిసింది లాభం మాత్రమే. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న మినీ వరల్డ్ వార్‌ను సైతం మన దేశంలోని కార్పొరేట్ శక్తులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నాయి. కార్మికుల జీతాల్లో కోత విధించడానికి, కనీస వేతనాలు పెంచకుండా ఉండటానికి అంతర్జాతీయ పరిణామాలను అవి ఒక సాకుగా వాడుకుంటాయి. సంక్షోభం వచ్చినప్పుడు నష్టాలను కార్మికుల నెత్తికి రుద్దడం, లాభాలు వచ్చినప్పుడు వాటిని స్విస్ బ్యాంకుల్లో దాచుకోవడం కార్పొరేట్ సంస్థల నైజం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కేవలం పీల్చుకోవడానికి గాలిని మాత్రమే కాదు, ప్రతి పౌరుడికి 'గౌరవప్రదమైన జీవన హక్కు'ను ప్రసాదించింది. పెరుగుతున్న ధరల మధ్య రూ.15,000తో నెట్టుకొచ్చే జీవితం గౌరవప్రదమైనది కాదు. ఇది కేవలం కొద్దిమంది జీతాల సమస్య కాదు. ఇది శ్రామిక వర్గం మనుగడకు, కార్పొరేట్ విధ్వంసానికి మధ్య జరుగుతున్న యుద్ధం. ఈ అంకెల గారడీని, ఈ నివేదికల విషాన్ని కార్మిక లోకం గుర్తించాలి. బ్లూ కాలర్, వైట్ కాలర్ అనే భేదాలు మర్చిపోయి ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా నిలబడాలి. మన నెత్తురును లాభాలుగా మార్చుకునే ఆ నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసే వరకు ఎలుగెత్తి పోరాడాలి.

# ఘనంగా తెదేపా కార్యాలయం ప్రారంభం





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి పెద్దాపురం పట్టణంలో నూతనంగా నిర్మించిన తెలుగు దేశం పార్టీ కార్యాలయాన్ని పెద్దాపురం సుధా కాలనీలో శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ఆధ్వర్యంలో తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు కార్యాలయాన్ని రిబ్బను కత్తిరించి ప్రారంభించారు. తొలుత పార్టీ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప దంపతులు ప్రత్యేక హోమ పూజలను నిర్వహించారు. ఈ పూజలను పంచారామ క్షేత్రం అయిన శ్రీ కుమార రామ భీమేశ్వర ఆలయ వేద పండితులు జరిపించి ఎమ్మెల్యేకు ఆశీర్వచనం పలికి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

ఈ కార్యాలయ ప్రారంభోత్సవంలో డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), జిల్లా తెదేపా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ విత్తనాల వెంకట రమణ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, సామర్లకోట పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, గౌరవాధ్యక్షులు అడబాల కుమారస్వామి, భీమేశ్వర స్వామి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్, నాయకులు బలుసు వాసు, నియోజక వర్గ పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశాఖకు సెమీ రింగ్ రోడ్డు

### - రాంబిల్లి నుంచి భోగాపురం వరకు నిర్మాణం - ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సేకరణ - రూ.14 వేల కోట్లతో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు - పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నానికి 102 కిలోమీటర్ల మేర సెమీ రింగ్‌రోడ్డు నిర్మిస్తామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విశాఖ మహా నగర ప్రాంతాభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. రాంబిల్లి నుంచి విశాఖ మీదుగా భోగాపురం వరకు ఈ సెమీ రింగ్‌రోడ్డు వస్తుందని తెలిపారు. దీనికి డీపీఆర్ తయారవుతోందని, ప్రజా ప్రతినిధులతో చర్చించిన తర్వాత అలైన్‌మెంట్ నిర్ణయిస్తామని వెల్లడించారు. అవసరమైన భూమిని ల్యాండ్ పూలింగ్ విధానంలో సేకరిస్తామన్నారు. రింగ్ రోడ్డుకు ఇరువైపులా లేఅవుట్లు వేసి, రైతులకు వాటా ఇస్తామని తెలిపారు. భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానిస్తూ బీచ్ కారిడార్ నిర్మాణం కూడా చేపడతామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు ఇచ్చేందుకు రూ.14 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. భూగర్భ కాలువల నిర్మాణానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ ఉందన్నారు. వర్షపు నీరు పోవడానికి ఓపెన్ డ్రైన్లు నిర్మిస్తామన్నారు. ఇళ్లలో కిచెన్, బాత్‌రూమ్‌ల్లో ఉపయోగించిన నీరు పోవడానికి ప్రత్యేక కాలువలు నిర్మించే ప్రణాళిక ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీటి నిర్మాణానికి రూ.29 వేల కోట్లు అవసరమని, ముందుగా జనాభా ఎక్కువగా, మీడియంగా ఉండే ప్రాంతాల్లో రూ.9 వేల కోట్లతో వీటి నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 123 మునిసిపాలిటీలలో మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీ) నిర్మాణానికి టెండర్లు పిలిచామన్నారు. భూమి విలువను బట్టి పన్ను వేసే విధానం గత ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని, దానినే కొనసాగిస్తున్నామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ పాల్గొన్నారు.

# పర్యాటక హబ్‌గా కైలాసగిరి

### - 'త్రిశూలం' ప్రారంభోత్సవంలో మంత్రి నారాయణ



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నంలో కైలాసగిరిని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తామని, అందుకుగాను ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. కైలాసగిరిపై రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మించిన 65 అడుగుల ఎత్తైన త్రిశూలం, ఢమరుకాలను శనివారం ఉదయం ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పర్యాటక రంగానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, దీనివల్ల ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని చెప్పారు. విశాఖలో ఈ త్రిశూలం పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణంగా నిలుస్తుందని తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో త్రిశూలం ప్రాజెక్టును పూర్తి చేసిన వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ కృషిని అభినందించారు. కైలాసగిరి అభివృద్ధికి ప్రత్యేకమైన మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని ఎంపీ శ్రీభరత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, లోకం నాగమాధవి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ తేజ్‌భరత్, సీఈ వినయకుమార్, సీఏఓ హరిప్రసాద్, బ్రహ్మకుమారీలు, అన్నమయ్య ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా గోవింద దీక్ష వెల్ఫేర్ జేఏసీ ప్రమాణ స్వీకారోత్సవం



**తిరుపతి, (రాజధాని వార్తలు):** తెలుగు రాష్ట్రాలలో గోవింద మాలలు ధరించే భక్తుల ఐక్యత, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల విస్తరణ మరియు భక్తుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకొని ఏర్పాటు చేసిన "గోవింద దీక్ష వెల్ఫేర్ జాయింట్ యాక్షన్ కమిటీ" నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తిరుపతి నగరంలోని మంగళం బీటీఆర్ కాలనీలో గల ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని బాధ్యతలు అప్పగించారు. అధ్యక్షులుగా ప్రబోధానంద పార్థసారథి, ప్రధాన కార్యదర్శిగా వేలూరు జగన్నాథం ఎన్నిక కాగా, గౌరవ అధ్యక్షులుగా వి.శ్రీధర్, శేషయ్యలను నియమించారు. కోశాధికారిగా డాక్టర్ సందీప్ దండు బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా దేవతా కృష్ణమూర్తి, వెంకటసుబ్బారెడ్డి, మల్లెల రామానుజులు, అంగర కృష్ణార్జునరావు, వి.వాసుదేవమూర్తి షాంబోలహరి, పాకాల కృష్ణమూర్తిలకు నియామక పత్రాలను అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పలువురు గురుస్వాములు మాట్లాడుతూ గోవింద మాల ధరించే భక్తులు సేవా దృక్పథంతో సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించాలని పిలుపునిచ్చారు. భక్తుల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, యువతలో ధార్మిక విలువలను పెంపొందించడం, అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, భక్తులకు మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించడం జేఏసీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున గోవింద సేవకులు, మాలధారులు, గురుస్వాములు, భక్తులు, కమిటీ సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తి గీతాలు, గోవింద నామస్మరణతో సభా ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కొత్త కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు.

# తొలి తిరుపతికి ఒక్కరోజు ఆదాయం రూ. 2.42 లక్షలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** తొలి తిరుపతిగా ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మండలం చదలాడ తిరుపతి శ్రీ శృంగారవల్లభ స్వామి దేవస్థానమునకు శనివారం ఒక్కరోజు ఆదాయం రూ. 2,42,361 ఆదాయం లభించింది. ఈ మేరకు ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు అందించిన వివరాల ప్రకారం శనివారం స్వామివారి దర్శనానికి సుమారు 13వేలు మంది భక్తులు రాగా శ్రీ స్వామి వారిని ప్రత్యేక పూల అలంకరణలో ఉంచి విశేష పూజలు చేపట్టారు. అలాగే ఆలయానికి శనివారం ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,56,410, అన్నదాన విరాళములు ద్వారా రూ. 59,216, కేశఖండన ద్వారా రూ. 8840, తులాభారం ద్వారా రూ. 750, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 17,145లు వెరశి రూ. 2,42,361 ఆదాయం సమకూరినట్టు చెప్పారు. దేవస్థానం తరుపున భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదం ఉచితంగా పంపిణీ చెయ్యడంతో పాటు వేసవి దృష్ట్యా భక్తులకు మజ్జిగ పంపిణి చేసారు. ఇంకా సుమారు 3 వేల మంది భక్తులు ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మెయిళ్ళ సంధ్య కృష్ణమూర్తి, ధర్మకర్తలు, గ్రామస్తులు సహకారంతో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి సేవలు అందించినట్టు ఆలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

# ప్రజల సమస్యలు తీర్చడమే చంద్రబాబు లక్ష్యం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతివారం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం పెద్దాపురం సుధా కాలనీలో నూతనంగా ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చినరాజప్ప ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజల వద్ద నుండి వారి సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ ఎంతో దోహదపడుతుందన్నారు. నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ తోడ్పాటు

**ప్రొద్దుటూరు, (రాజధాని వార్తలు):** మహిళలు స్వయంకృషితో ఎదగడం అభినందనీయమని త్రీటౌన్ సీఐ రామాంజనేయులు తెలిపారు. వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడానికి టైలరింగ్ శిక్షణ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలను అభినందించిన ఆయన, అన్ని రంగాల్లో మహిళలు రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సీఐ రామాంజనేయులు, వికసిత ఫౌండేషన్ చైర్మన్ షూలం లక్ష్మీదేవి చేతుల మీదుగా ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. గ్రీన్ లీఫ్ ఆగ్రో సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మహేంద్ర యాదవ్ మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పనలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కుటుంబ ఆర్థికాభివృద్ధికి కూడా ఇవి తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి శివప్రసాద్, గుర్రప్ప, శివ రామ్మోహన్ పాల్గొన్నారు.

# నితిన్ సైన్స్ ఫిక్షన్ మూవీ.. ఇప్పట్లో కష్టమేనా?



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ ఒకప్పుడు వరుస విజయాలతో మంచి మార్కెట్ సంపాదించినా.. గత కొన్నేళ్లుగా మాత్రం సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. భీష్మ తర్వాత ఆ రేంజ్ హిట్ ను అందుకోలేకపోయిన నితిన్.. వరుసగా సినిమాలు చేస్తున్నా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా గతేడాది విడుదలైన రాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలపై అభిమానుల్లో మంచి అంచనాలు ఉన్నా.. రెండూ నిరాశపరిచాయి. ఇలాంటి పరిస్థితుల్లో నితిన్ కొత్త ప్రాజెక్టుల ఎంపికలో జాగ్రత్తగా ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నారి సిరిసవాడ, టి సోమశేఖర్ ఆ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయ్ సినిమా ఫేమ్ అంజి కె. మణిపుత్ర చెప్పిన కథ నచ్చడంతో ఆ ప్రాజెక్ట్‌ను కూడా ముందుకు తీసుకెళ్లాలని నితిన్ భావిస్తున్నారట. అయితే నాగవంశీ తన సినిమాను వీలైనంత త్వరగా పూర్తి చేసి విడుదల చేయాలనే ప్లాన్ లో ఉన్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే దర్శకుడు వీఐ ఆనంద్ తో నితిన్ చేయాల్సిన సైన్స్ ఫిక్షన్ మూవీపై మాత్రం అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొదట ఆ ప్రాజెక్ట్‌పై మంచి హైప్ ఏర్పడింది. ఎక్కడికి పోతావు చిన్నవాడా, ఒక్కక్షణం, ఊరు పేరు భైరవకోనలాంటి విభిన్న కథలతో గుర్తింపు తెచ్చుకున్న వీఐ ఆనంద్.. నితిన్ కోసం కూడా ఓ కొత్త కాన్సెప్ట్ సిద్ధం చేసినట్లు ప్రచారం జరిగింది. ఆ సినిమా సైన్స్ ఫిక్షన్ జానర్‌లో తెరకెక్కనుందని, అన్నదమ్ముల నేపథ్యంతో కథ సాగుతుందని సమాచారం. అంతేకాదు ఇందులో నితిన్ డ్యూయల్ రోల్ చేయనున్నారని కూడా టాక్ వినిపిస్తోంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత నితిన్ మరోసారి డ్యూయల్ రోల్‌లో కనిపించే అవకాశం ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. గతంలో ఆయన చేసిన అల్లరి బుల్లోడులో డబుల్ రోల్ కనిపించినా.. ఆ సినిమా ఆశించిన ఫలితం ఇవ్వలేదు. అయితే ఇప్పుడు ఆ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్ ముందుకు సాగడంలో ప్రధాన అడ్డంకి బడ్జెట్‌గా మారినట్లు తెలుస్తోంది. సైన్స్ ఫిక్షన్ కథ కావడంతో భారీ వ్యయంతో తెరకెక్కించాల్సిన పరిస్థితి ఉందట. కానీ వరుస ఫ్లాపుల కారణంగా ప్రస్తుతం నితిన్ మార్కెట్ కొంత తగ్గిందనే అభిప్రాయం వినిపిస్తోంది. దీంతో నిర్మాతలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు కాస్త వెనకడుగు వేస్తున్నారని సమాచారం. అంతేకాదు కథలో కొన్ని మార్పులు చేయాలని నిర్మాత సూచించారని, ముఖ్యంగా సెకండాఫ్ విషయంలో సందేహాలు వ్యక్తమయ్యాయని టాక్. ఖర్చు తగ్గించేలా మార్పులు చేయాలని కోరినా..దర్శకుడు వీఐ ఆనంద్ తన అసలు విజన్‌ను మార్చేందుకు అంతగా ఆసక్తి చూపలేదని ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ ప్రాజెక్టు ప్రస్తుతం తాత్కాలికంగా పక్కకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో నితిన్ వివిధ సినిమాలతో బిజీ కావడంతో.. వీఐ ఆనంద్ అదే కథను మరో హీరోకు వినిపించే ప్రయత్నంలో ఉన్నారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

అదే సమయంలో నితిన్ మాత్రం ముందుగా సితార బ్యానర్ సినిమా ద్వారా స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఆ సినిమా విజయం సాధిస్తే ఆయన మార్కెట్ మళ్లీ బలపడే అవకాశం ఉంది. అప్పుడు వీఐ ఆనంద్‌తో సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్ తిరిగి పట్టాలెక్కే ఛాన్స్ ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. అదే నిజమైతే ఇప్పట్లో ఆ సినిమా సెట్స్ పైకి వెళ్లడం కష్టమేనేమో! మరేం జరుగుతుందో వేచి చూడాలి.

# మిథిలా సెట్ లో స్వయంవరం!



భారతీయ చలనచిత్ర చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న చిత్రం రామాయణ్. ప్రస్తుతం ముంబైలో శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. దర్శకుడు నితేష్ తివారీ పౌరాణిక గాథను వెండితెరపై ఓ అద్భుత దృశ్యకావ్యంగా మలిచేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. తాజాగా ముంబైలో వేసిన భారీ మిథిలా నగరం సెట్‌లో సినిమాలోని అత్యంత కీలకమైన సీత స్వయంవరం సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ వేడుకను కళ్లకు కట్టినట్లు చూపించేందుకు చిత్ర యూనిట్ భారీ ఏర్పాట్లు చేసింది. ఈ స్వయంవరం ఘట్టం రామాయణంలోనే అద్భుతమైన మలుపు. జనక మహారాజు కొలువులో శివ ధనుస్సును ఎక్కుపెట్టి సీతమ్మను రాముడు వివాహం చేసుకునే ఈ సన్నివేశం కోసం ముంబై స్టూడియోలో కోట్ల రూపాయల వ్యయంతో ఒక రాజభవనం సెట్‌ను నిర్మించారు. ఆ కాలం నాటి వైభవం ఉట్టిపడేలా మిథిలా నగర సంస్కృతి ప్రతిబింబించేలా కళా దర్శకులు ప్రతి చిన్న అంశాన్ని ఎంతో జాగ్రత్తగా తీర్చిదిద్దారు. షూటింగ్ సెట్‌లోకి అడుగు పెడితే త్రేతాయుగంలో ఉన్నామా? అనే అనుభూతి కలుగుతోందని సినీ వర్గాలు అంటున్నాయి. రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్న సన్నివేశాల్లో ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ముఖ్యంగా స్వయంవరం వేదికపై సాయి పల్లవి సీతమ్మ పాత్రలో అత్యంత దైవికంగా కళాత్మకంగా కనిపిస్తోందని సమాచారం. ఈ ఘట్టం కోసం పదుల సంఖ్యలో ఇతర రాజులు, వందలాది మంది సహాయ నటీనటులు పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. భారీ విజువల్ ఎఫెక్ట్స్ తో పాటు సహజమైన సెట్టింగ్స్ కలయికతో ఈ సీన్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. శివ ధనుస్సును రాముడు భగ్నం చేసే సన్నివేశాన్ని చిత్రీకరించేటప్పుడు అత్యున్నత స్థాయి సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. కేవలం గ్రాఫిక్స్‌పైనే ఆధార పడకుండా నటీనటుల హావభావాలు, ఆ సన్నివేశంలోని ఉద్వేగం ప్రేక్షకులకు నేరుగా కనెక్ట్ అయ్యేలా నితేష్ తివారీ చిత్రీకరిస్తున్నారుట. స్వయంవరం ఘట్టం పూర్తయ్యాక రామ-సీతల వివాహ వేడుకను కూడా అదే స్థాయిలో అట్టహాసంగా చిత్రీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. నటీనటుల ఎంపిక మాత్రమే కాకుండా సెట్స్, కాస్ట్యూమ్స్ విషయంలో కూడా చిత్ర బృందం ఎక్కడా రాజీ పడలేదు. ముంబైలో జరుగుతోన్న ఈ షెడ్యూల్ సినిమాలోని మొదటి భాగానికి అత్యంత కీలకం. బాలీవుడ్ - సౌత్ ఇండస్ట్రీల కలయికతో రూపొందుతున్న చిత్రం భారతీయ సినిమా స్థాయిని అంతర్జాతీయ వేదికపై మరో మెట్టు ఎక్కించడం ఖాయంగా కనిపిస్తోంది. స్వయంవరం సందడి రామాయణ చిత్రంపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. పురాణాల్లోని గొప్పతనాన్ని నేటి తరం టెక్నాలజీతో జోడించి చూపిస్తున్న ఈ ప్రయత్నం వెండితెరపై ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

# మరోసారి అదే ఫార్ములాతో అనిల్ రావిపూడి



టాలీవుడ్‌లో కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన డైరెక్టర్ అనిల్ రావిపూడి మరోసారి తన స్పీడ్ ప్లానింగ్‌తో ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అవుతున్నారు. విక్టరీ వెంకటేష్ దగ్గుబాటి, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ మల్టీస్టారర్ మూవీకి సంబంధించిన తాజా సమాచారం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. జులై నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ వేగంగా కొనసాగుతున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ ప్రాజెక్ట్‌ను అనిల్ రావిపూడి గత సినిమాల మాదిరిగానే అత్యంత వేగంగా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నాడన్న వార్తలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాకు సంగీతాన్ని జీవీ ప్రకాష్ కుమార్ అందించనున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్స్ దాదాపు పూర్తయ్యాయని, పాత్రల డిజైనింగ్‌తో పాటు షూటింగ్ ప్లానింగ్ కూడా క్లియర్‌గా సిద్ధమైందని టాక్ వినిపిస్తోంది. జులైలో షూటింగ్ ప్రారంభించి నవంబర్ లేదా డిసెంబర్ నాటికి టోటల్ షూట్ కంప్లీట్ చేయాలనే టార్గెట్‌తో టీమ్ ముందుకు వెళ్తోందట. ఒక కమర్షియల్ మల్టీస్టారర్ సినిమాను కేవలం ఐదు నుంచి ఆరు నెలల్లో పూర్తి చేయాలనుకోవడం చిన్న విషయం కాదు. అయితే అనిల్ రావిపూడి వర్కింగ్ స్టైల్‌ను పరిశీలిస్తే ఇది అసాధ్యంగా కనిపించడం లేదు. గతంలో కూడా ఆయన చాలా తక్కువ సమయంలో సినిమాలను పూర్తి చేసి రిలీజ్ చేసిన ట్రాక్ రికార్డ్ ఉంది. ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ సినిమాలో ప్రధాన బలం ఫన్ ఎలిమెంట్స్ అని తెలుస్తోంది. స్క్రిప్ట్ స్టేజ్ నుంచే ఎంటర్‌టైన్మెంట్ అద్భుతంగా వర్కౌట్ అయిందని, డైలాగ్స్‌తో పాటు సిచ్యువేషనల్ కామెడీ కూడా సినిమాకు మెయిన్ ఎట్రాక్షన్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. ముఖ్యంగా వెంకటేష్ కామిక్ టైమింగ్, కళ్యాణ్ రామ్ స్క్రీన్ ప్రెజెన్స్ కలిసొస్తే తెరపై కొత్త తరహా ఎంటర్‌టైన్మెంట్ కనిపించే అవకాశముందని అభిమానులు భావిస్తున్నారు.

అనిల్ రావిపూడి స్టైల్‌కు తగ్గట్టుగా ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూనే మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునేలా కథను డిజైన్ చేసినట్టు టాక్. ఇక ఈ ప్రాజెక్ట్ వేగంగా పూర్తవుతుండటంపై ఇండస్ట్రీలో మరో ఆసక్తి కర చర్చ కూడా జరుగుతోంది. సాధారణంగా మల్టీస్టారర్ సినిమాల్లో డేట్స్ మేనేజ్‌మెంట్, ఆర్టిస్టుల కాల్షీట్స్, ప్రొడక్షన్ స్కేల్ కారణంగా షూటింగ్ ఎక్కువ కాలం పడుతుంది. కానీ అనిల్ రావిపూడి మాత్రం స్క్రిప్ట్ దశలోనే పూర్తి క్లారిటీతో పనిచేస్తాడన్న పేరు ఇప్పటికే సంపాదించుకున్నారు. ప్రతి సీన్‌ను ముందుగానే పక్కాగా ప్లాన్ చేసుకోవడం, సెట్స్‌పై టైమ్ వేస్ట్ కాకుండా చూసుకోవడం ఆయన స్పెషాలిటీ. అందుకే ఈ సినిమాను కూడా అనుకున్న సమయానికే పూర్తి చేసి 2027 సంక్రాంతి బరిలోకి తీసుకురావాలనే ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నట్టు తెలుస్తోంది. సరైన కంటెంట్, స్టార్స్ మధ్య మంచి కెమిస్ట్రీ, అనిల్ మార్క్ కామెడీ కలిస్తే ఈ సినిమా సంక్రాంతి సీజన్‌లో భారీ ఎంటర్‌టైనర్‌గా నిలిచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# సూర్య 'కరుప్పు'.. ఈసారి గట్టిగానే కొడతారా?




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య గత కొంతకాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. భారీ అంచనాల మధ్య వచ్చిన కంగువ, రెట్రో సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయాయి. దీంతో ఇప్పుడు సూర్య అభిమానులందరి చూపు ఆయన లేటెస్ట్ మూవీ కరుప్పు పైనే ఉంది. దర్శకుడు ఆర్జే బాలాజీ తెరకెక్కిస్తున్న ఆ యాక్షన్ కోర్ట్ రూమ్ డ్రామా తమిళంతో పాటు తెలుగులో వీరభద్రుడు పేరుతో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ సినిమాపై మంచి బజ్ తీసుకురాగా.. తాజాగా వచ్చిన ట్రైలర్ ఆ అంచనాలను మరింత పెంచేసింది. ట్రైలర్ మొత్తం చూస్తే గ్రామీణ నేపథ్యం, న్యాయం కోసం పోరాటం, రివెంజ్ వంటి అంశాలను మాస్ టచ్ తో చూపించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సూర్య ఎంట్రీ, డైలాగ్ డెలివరీ, యాక్షన్ సీన్స్ అభిమానులకు ఫుల్ ట్రీట్ ఇచ్చేలా కనిపిస్తున్నాయి. కథ విషయానికి వస్తే.. బికె అనే ప్రముఖ లాయర్ పాత్రలో ఆర్జే బాలాజీ కనిపిస్తున్నారు. సామాన్య ప్రజలకు న్యాయం చేస్తానని చెప్పుకుంటూ వారి అమాయకత్వాన్ని ఉపయోగించుకునే వ్యక్తిగా ఆయన పాత్రను డిజైన్ చేసినట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒక యువతి కేసులో మోసం జరిగిన తర్వాత రంగంలోకి దిగే కరుప్పు పాత్రలో సూర్య కనిపించనున్నారు. కేవలం ఆ కేసుకు న్యాయం చేయడమే కాకుండా, బికెకు బుద్ధి చెప్పాలని కరుప్పు నిర్ణయించుకుంటాడు. అక్కడి నుంచి ఇద్దరి మధ్య జరిగే పోరు సినిమాకు ప్రధాన ఆకర్షణగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఇక హీరోయిన్‌గా నటిస్తున్న సీనియర్ బ్యూటీ త్రిష కృష్ణన్ మరోసారి తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ట్రైలర్‌లో ఆమె లాయర్ పాత్రలో కనిపించడం ఆసక్తిని పెంచుతోంది. సూర్య-త్రిష కాంబినేషన్ కు ప్రేక్షకుల్లో ముందే మంచి క్రేజ్ ఉండటంతో ఈ జంట మరోసారి మ్యాజిక్ చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ట్రైలర్‌లో మరో ప్రధాన హైలైట్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు మెయిన్ అసెట్‌గా మారింది. ముఖ్యంగా యాక్షన్ బ్లాక్స్‌లో వచ్చిన మాస్ బీట్లు, ఎమోషనల్ సీన్స్ లో వినిపించిన స్కోర్ సినిమాపై అంచనాలను పెంచేశాయి.

విజువల్స్ కూడా డార్క్ టోన్‌లో స్టైలిష్‌గా కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇటీవల సూర్య సినిమాల సెలక్షన్‌పై కొంత విమర్శలు వచ్చి నప్పటికీ.. కరుప్పు ట్రైలర్ మాత్రం అభిమానుల్లో మళ్లీ నమ్మకం పెంచింది. సూర్యను పూర్తి స్థాయి ఊరమాస్ అవతార్ లో చూపించడంలో దర్శకుడు ఆర్జే బాలాజీ సక్సెస్ అయ్యారనే టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా కోర్ట్ రూమ్ డ్రామాను మాస్ యాక్షన్‌తో మిక్స్ చేసిన తీరు సినిమాకు ప్లస్ అవుతుందని అంతా భావిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఆ చిత్రం మే 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళంతో పాటు తెలుగులో కూడా భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవు తోంది. వరుస ఫ్లాపుల తర్వాత సూర్యకు ఆ సినిమా గట్టి కమ్ బ్యాక్ ఇస్తుందా? అభిమానులు ఆశిస్తున్న విజయాన్ని అందిస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఘనంగా ముగిసిన కిండర్ వండర్ కిడ్స్ సమ్మర్ క్యాంప్








**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన కిండర్ వండర్ కిడ్స్ సమ్మర్ క్యాంప్ ముగింపు ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ సుగుణ రెడ్డి మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు వివిధ అంశాలను జీవితంలో అలవర్చుకోవాలని కోరారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని సమ్మర్ క్యాంపు ద్వారా వెలికి తీయడం జరిగిందని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు కుకింగ్, హార్స్ రైడింగ్, శ్లోకాలు, రైఫిల్ షూటింగ్, చిత్రలేఖనం, స్టోరీ టెల్లింగ్ వంటివి నేర్పించడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నందనా బోహర మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో సమ్మర్ క్యాంపులో నేర్పించిన అన్ని అంశాలను ఎంతో శ్రద్ధతో భక్తితో నేర్చుకున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా యాజమాన్యం చేస్తున్న కృషికి ప్రత్యేకంగా అభినందించారు.


## పైడితల్లమ్మ పదాలు పుస్తకావిష్కరణ



**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లా కేంద్రానికి చెందిన యువ రచయిత యడ్ల శ్రీనివాసరావు రాసిన పైడితల్లమ్మ పదాలు పుస్తకాన్ని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్‌తో కలిసి డిమ్స్ రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ బాలాజీ టెక్స్ టైల్ మార్కెట్, పూర్వ అధ్యక్షులు పులిపాటి రామారావు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బోండా రమేష్, ఉత్తరాంధ్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి, జిల్లా శాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు గిరిజా ప్రసన్న, వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్ల పూడి సుభద్రాదేవి, శ్రీ వాసవీ ఆర్యవైశ్య సేవా సంఘం కంటోన్మెంట్ శాఖ కార్యదర్శి బత్తుల కామేష్, కోశాధికారి ముత్తా మల్లికార్జున రావు, విశ్వసాహితీ వేదిక అధ్యక్షురాలు భోగరాజు సూర్యలక్ష్మీ, న్యాయవాది దాసరి పద్మ, పాఠశాల కరస్పాండెంట్ ఎ శ్రీనివాస రావు, డైరక్టర్ రాజేష్, ప్రిన్సిపాల్ మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పట్టాభిషేకం

**విజయనగరం, (రాజధాని వార్తలు):** తాము సాధించిన ఫలితాలు విద్యార్థుల ప్రతిభకు గీటురాళ్లుగా నిలుస్తాయి. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన ప్రతిభావంతులకు తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. 50 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కాగా అందులో 17 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. 100% ఉత్తీర్ణత సాధించడమే కాక 30 శాతం మంది విద్యార్థులు 90 శాతం మార్కులు సాధించడం అభినందనీయమని సమితి అధ్యక్షులు గురు ప్రసాద్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు,



డైరెక్టర్ రాజేష్, ప్రిన్సిపల్ మల్లిక, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ విజయనగరం జిల్లా శాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు గిరిజ ప్రసన్నతో కలిసి విద్యార్థులకు పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల మాతృమూర్తులను కూడా ఘనంగా సత్కరించారు.

## 18న డి ఆర్ డి ఎ కార్యాలయంలో వాహనాలు వేలం

**విశాఖ, (రాజధాని వార్తలు):** విశాఖ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో బాధపడిన వాహనాలను ఈనెల 18న మధ్యాహ్నం మూడు గంటలకు సంస్థ కార్యాలయం వద్ద వేలం వేస్తున్నట్లుగా డైరెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఒక బస్సు, స్కార్పియో వాహనంతో పాటు ఇన్నోవా కారు వేలం వేస్తున్నట్లుగా డిఆర్డిఏ డైరెక్టర్ వెల్లడించారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు బస్సుకు పది వేలు, స్కార్పియోకి 5000, ఇన్నోవాకు 5000 ధరావత్తు చెల్లించాల్సి ఉందని, ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు మిగిలిన వివరాలు కోసం సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఓ ప్రకటనలో వెల్లడించారు.

## అనకాపల్లి ఇస్కాన్ మందిరంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చొరవ చూపుతోంది. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ మరియు అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రావణి వారి ఆదేశాల మేరకు, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి జాతీయ రహదారిపై డైట్ ఇంజనీరింగ్ కాలేజీ ఎదురుగా ఉన్న ఇస్కాన్ మందిరంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో ట్రాఫిక్ నిబంధన లపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వెంకట నారాయణ పర్యవేక్షణలో, ట్రాఫిక్ ఎస్.ఐ శేషగిరిరావు ఈ సదస్సులో పాల్గొని పిల్లలకు, పెద్దలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే విధించే జరిమానాల గురించి అవగాహన కల్పించారు. సదస్సు చివరలో ఇస్కాన్ మందిర వ్యవస్థాపకులు ప్రభుజీ నేతృత్వంలో ఒక ముఖ్యమైన కార్యక్రమం జరిగింది. హాజరైన పెద్దలందరితో "మద్యం సేవించి వాహనాలు నడపమని, ఎల్లప్పుడూ చట్టాలకు లోబడి బాధ్యతాయుతమైన పౌరులుగా ఉంటామని" ట్రాఫిక్ ఎస్.ఐ సమక్షంలో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. చిన్నప్పటి నుండే ట్రాఫిక్



నియమాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని ఈ సందర్భంగా పోలీసులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### - ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం - జిల్లా ప్రధాన కార్యదర్శి వీరనాల శివ నారాయణ

**జమ్మలమడుగు, (రాజధాని వార్తలు):** చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వీరణాల శివనారాయణ డిమాండ్ చేశారు. మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ జిల్లాలో చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదని తెలిపారు. గుర్తింపు కార్డులు అధికారులు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నారన్నారు. ముఖ్యంగా చేనేత కార్మికులు బ్యాంకులకు వెళ్లి లోను పెట్టుకోవాలంటే గుర్తింపు కార్డు చాలా అవసరమని, బ్యాంకు అధికారులు వ్యక్తిగత పూచీకత్తు కింద రుణాలు ఇవ్వాలని అడిగితే బ్యాంకు అధికారులు ఇవ్వడం లేదని చేనేతలు సమస్యను తమ దృష్టికి తెచ్చారు.అలాగే గతంలో నేతన్న నేస్తం కింద 24000 రూపాయలు వచ్చేదని చాలా వరకు ముడిసరుకుల



కొనుగోలుకు, పేదరికంలో ఉన్న చేనేత కార్మికులకు ఎంతగానో ఉపయోగపడిందని ప్రభుత్వం పథకాన్ని కొనసాగించి చేనేతలను ఆదుకోవాలని, అలాగే ఇండ్లు లేని వారికి మగ్గం పెట్టుకునే విధంగా ప్రత్యేకంగా చేనేత కార్మికులకు 5 సెంట్లు స్థలం కేటాయించాలని వాటి నిర్మాణానికి 6 లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు.

## వేసవి విజ్ఞాన శిబిరాలలో పాల్గొని విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

### – జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



**ఉండి, (రాజధాని వార్తలు):** గ్రంథాలయాలలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం పాలకోడేరు మండలం పాలకోడేరు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా లైబ్రరీలోని పుస్తకాల నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, వారు అభ్యసిస్తున్న కోర్సులు, క్రీడలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 28 నుండి జూన్ 6 వరకు మొత్తం 40 రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ శిబిరాలలో చిత్రలేఖనం, చెస్, క్యారమ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, యోగ, సింగింగ్, జనరల్ నాలెడ్జ్ తదితర అంశాలలో శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 31 శాఖ గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న ఈ వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేవాలయాల సందర్శనకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో, గ్రంథాలయాలలో పుస్తక పఠనానికి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ అన్నారు. దేవాలయాల ద్వారా మనశ్శాంతి లభిస్తే, గ్రంథాలయాల ద్వారా మనశ్శాంతితో పాటు విజ్ఞానం కూడా లభిస్తుందని పేర్కొన్నారు.

## "మాతృదేవోభవ - పితృదేవోభవ - ఆచార్య దేవోభవ అనే మూడు మహోన్నత సూత్రాలే మానవ జీవితానికి పునాదులు

**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** "మాతృదేవోభవ – పితృదేవోభవ – ఆచార్యదేవోభవ అనే మూడు మహోన్నత సూత్రాలే మానవ జీవితానికి పునాదులు. తల్లి జన్మనిస్తుంది, తండ్రి పెంచి పోషిస్తూ విద్యాబుద్ధులు నేర్పిస్తాడు, గురువు జ్ఞానాన్ని ప్రసాదించి జీవితానికి దిశానిర్దేశం చేస్తాడు. ఈ ముగ్గురిలో తల్లి స్థానం అత్యున్నతమైనది" అని ప్రముఖ సంఘ సేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి భావోద్వేగంతో పేర్కొన్నారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ఒక తల్లి తన పిల్లల కోసం జీవితాంతం ఎన్నో త్యాగాలు చేస్తుందని తెలిపారు. పిల్లలు సుఖంగా ఉండాలని తాను కష్టాలు భరిస్తూ, ఆకలి దప్పికలను కూడా మరిచి వారి భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తుందని చెప్పారు. గర్భంలో తొమ్మిది నెలలు మోసి, జన్మనిచ్చి, ప్రేమతో పెంచి, మంచి మార్గంలో నడిపించే మహోన్నత వ్యక్తి తల్లేనని అన్నారు. తన తల్లి రోహిణి అమ్మను స్మరించుకుంటూ డాక్టర్ గుణవతి కన్నీటి పర్యంతమయ్యారు. గత ఏడాది తన తల్లి తిరిగిరాని అనంత లోకాలకు వెళ్లిపోవడం తన జీవితంలో ఎన్నటికీ తీరని మాతృవియోగాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. "తల్లి ఉన్నప్పుడు ఆమె ప్రేమ విలువ పూర్తిగా అర్థం కావడం లేదు. కానీ తల్లి దూరమైన తర్వాత ప్రతి క్షణం ఆమె జ్ఞాపకాలే వెంటాడుతుంటాయి. తల్లి ప్రేమకు ఈ ప్రపంచంలో ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు" అని భావోద్వేగంతో తెలిపారు. నేటి సమాజంలో యువత తల్లిదండ్రుల సేవలను మరచిపోతుండటం బాధాకరమని ఆమె అన్నారు. తమ జీవితాలను పిల్లల కోసం అంకితం చేసిన తల్లిదండ్రులను గౌరవించి, ప్రేమతో



చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి సంతానానిదని పేర్కొన్నారు. కానీ కొందరు యువత తల్లిదండ్రులను భారంగా భావించి వృద్ధాశ్రమాలకు పంపించడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సమాజ హితానికి ఎంతమాత్రం మంచిది కాదని, కుటుంబ వ్యవస్థలను బలహీనపరిచే ప్రమాదకర పరిస్థితి అని హెచ్చరించారు. తల్లిదండ్రులు దేవుళ్లతో సమానమని, వారి ఆశీర్వాదం లేకుండా జీవితంలో నిజమైన ఆనందం, అభివృద్ధి సాధ్యం కాదని డాక్టర్ గుణవతి అన్నారు. ప్రతి వ్యక్తి తన తల్లి దండ్రుల పట్ల కృతజ్ఞతతో ఉండి, వారిని పూజించి, సేవ చేయడం ద్వారా వారి రుణం తీర్చుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతి కుటుంబ బంధాలకు, పెద్దల గౌరవానికి ప్రతీక అని, ఆ విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా తల్లుల త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, ప్రతిరోజూ వారిని ప్రేమతో గౌరవించాలని డాక్టర్ గుణవతి పిలుపునిచ్చారు.

# అల్మాస్ పేటలో 144 సెక్షన్

## - సర్కిల్ పేరు విషయమై రాళ్లు విసురుకున్న ఇరువర్గాలు
## - సిఐతో సహా పలువురికి గాయాలు





**కడప, (రాజధాని వార్తలు):** కడప నగరం అల్మాస్ పేటలో టీపు సుల్తాన్ సర్కిల్ విషయమై గత 12 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంది. ఈ మధ్య కార్పొరేషన్ పాలకవర్గం చిట్ట చివరి సర్వసభ్య సమావేశంలో తీర్మానించింది. కమీషనర్ త్వరలో అధికారికంగా ప్రకటిస్తామన్నారు.ఇంతలో ఆరెస్సెస్, విశ్వహిందు పరిషత్ కలిసి గత నెలలో టిప్పు సుల్తాన్ పేరు మార్చాలని కలెక్టర్‌కు వినతి సమర్పించారు. మళ్ళీ సర్కిల్ విషయం పెండింగ్ అయ్యింది. ఇంతలో అల్మాస్ పేటలో ఉన్న దేవాలయం వద్ద హుటాహుటిన 31 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఈ నెల 10 బైక్ ర్యాలీ 12న హనుమాన్ జయంతి సందర్భంగా విగ్రహ ఆవిష్కరణ పెట్టుకున్నారు. ఇంతవరకు బాగానే వుంది, ఎవరికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. కానీ ఆలయ కమిటీ వివాదం సృష్టించేలా ఈ కార్యక్రమాలను తెలుపుతు ఏర్పాటు చేసిన పెద్ద బ్యానర్‌ల పైన హనుమాన్ సర్కిల్ అని పెట్టారు. మైక్‌లో అనౌన్స్ మెంట్ పెట్టారు. ముందే టిప్పు సుల్తాన్ సర్కిల్ పెండింగ్‌లో ఉంది. మళ్ళీ పుండు మీద కారం చల్లినట్లు హనుమాన్ సర్కిల్ పేరు పెట్టడంతో ముస్లిం ప్రజలు సర్కిల్ వద్ద గుమికూడారు. సర్కిల్ వద్ద టిప్పు సుల్తాన్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. అంతలోనే ఆరెస్సెస్, హిందు సంఘాల వారు అక్కడికి చేరుకొని ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఇంచార్జి డీఎస్పీ బాలస్వామిరెడ్డి, టూ టౌన్ సి.ఐ జి.ప్రసాద్‌రావు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను అదుపు చేయడానికి యత్నించారు. ఇరువర్గాలు రాళ్లు రువ్వుకొంటు పరిస్థితి శ్రుతి మించడం, అందులో ఒక సిఐ స్థాయి అధికారికి గాయం కావడంతో లాఠీచార్జ్ జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం 144 తదితర సెక్షన్‌లు పెట్టారు. ఈ ఘర్షణలో పోలీసులకు, ప్రజలకు గాయాలయ్యాయి. ఇప్పటికి పరిస్థితి పోలీసుల అదుపులోనే ఉంది.

# ఉర్దూ అకాడమీ ఉచిత పుస్తకాల పంపిణీ





**కడప, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో, అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ నాయకత్వంలో నిర్వహిస్తున్న "ఆవో ఉర్దూ సీఖేన్" (రండి ఉర్దూ నేర్చుకుందాం) ఉర్దూ ఫ్రీ సమ్మర్ కోర్సుకు సంబంధించిన పుస్తకాలను కడప జిల్లాలోని నాలుగు సమ్మర్ క్యాంప్ కేంద్రాలలో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. అంజుమన్ తరక్కీ ఉర్దూ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రెసెంట్ హైస్కూల్ కేంద్రంలో పుస్తకాల పంపిణీ జరిగింది. అదేవిధంగా అకాయపల్లి మస్జిద్‌లో కె.అబ్దుల్ మజీద్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ నిర్వహిస్తున్న కేంద్రంలో, బెల్లం మండీ మక్తబె మహబూబియా కేంద్రంలో మరియు నబీకోట కడపలోని మదర్సా ఫైజాన్ మహబూబ్ ఇలాహీ కేంద్రంలో కూడా ఉచితం ఉర్దూ పుస్తకాలు పంపిణీ చేయబడ్డాయి. ఈ సందర్భంగా అంజుమన్ తరక్కీ ఉర్దూ కడప జిల్లా శాఖ అధ్యక్షుడు సత్తార్ ఫైజీ మాట్లాడుతూ, ఉర్దూ అకాడమీ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. మాతృభాషపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని, ఉర్దూ భాష యొక్క సంస్కృతి, చరిత్ర గొప్పతనాన్ని గౌరవించాలని అన్నారు. వేసవి సెలవుల్లో ఉర్దూ ఉచిత కోచింగ్ ను సద్వినియోగం చేసుకుని ఉర్దూ చదవడం, రాయడం నేర్చుకునేందుకు ఇది ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. మత, వర్గ భేదాలు లేకుండా బాలురు, బాలికల్లో ఉర్దూపై ఆసక్తి, అభిరుచి పెంపొందించాలని పిలుపునిచ్చారు. "ఉర్దూ జీవించి ఉంది, ఎప్పటికీ జీవిస్తూనే ఉంటుంది" అని అన్నారు. ఆవో ఉర్దూ సీఖేన్ పుస్తక సంపాదకుడు ఇఫ్తేఖార్ జమాల్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మైనారిటీ శాఖ మంత్రిమంత్రి ఫారూఖ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూఖ్ శిబ్లీ ఆసక్తితో రాష్ట్రంలో ఉర్దూ అభివృద్ధి, ప్రాచుర్యానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలియజేస్తూ ఉర్దూ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ తరక్కీ ఉర్దూ కడప జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఖదీర్ పర్వేజ్, ఉర్దూ సమ్మర్ క్యాంప్ కోఆర్డినేటర్ నజీర్ బాషా, ట్యూటర్లు ఫయాజుర్ రెహ్మాన్, ఆలియా పాల్గొన్నారు. కె.అబ్దుల్ మజీద్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ కడప అధ్యక్షుడు మరియు వ్యవస్థాపకుడు మక్బూల్ అహ్మద్ మక్బూల్, అకాయపల్లి మస్జిద్ కమిటీ కార్యదర్శి సుభాన్ బాషా, అధ్యక్షుడు కరీముల్లా, బజ్మే జకీ అధ్యక్షుడు అతాఉల్లా అఖ్తర్, మక్తబ్ మహబూబియా వ్యవస్థాపకుడు మరియు ప్రముఖ కథా రచయిత మహమూద్ షాహిద్, అమీరున్నిసా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపకుడు డాక్టర్ అన్వర్ హాది విద్యార్థులు మరియు తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా తల్పగిరి రంగనాథ స్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం

## - ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి















**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నూతన పాలక మండలి చైర్మన్ లెక్కల వెంకారెడ్డి, పదకొండు మంది సభ్యులతో ప్రమాణం చేయించిన మంత్రులు.

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాయింట్స్ :

రంగనాథ స్వామి దేవస్థానం పురాతనమైన, పవిత్రమైన ఆలయం. ఈ ఆలయానికి ప్రమాణం చేసిన చైర్మన్, సభ్యులు పదవిని బాధ్యతగా భావించాలి. భక్తుల సేవే పరమావధిగా పనిచేయాలి. గత ప్రభుత్వంలో దేవాలయాలకు భద్రత కొరవడింది. విధ్వంసాలు సృష్టించారు. సనాతన ఆచార వ్యవహారాలను, ధర్మాలను అపహాస్యం చేశారు. భక్తులు ఆలయాలకు వెళ్లటమే మానేసేలా చేశారు. రాష్ట్రంలో తిరిగి ఆధ్యాత్మిక శోభ తీసుకు రావాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. 700 ఆలయాలను 823 కోట్లతో పునరుద్ధరిస్తున్నాము. 74 వేల పది లక్షలు ధూప దీప నైవేద్యాలకు ప్రభుత్వం కేటాయిస్తుంది. 750 కోట్లతో రాష్ట్రంలో ఐదు వేల భజన మందిరాల నిర్మాణానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 113 కోట్లతో 617 భజన మందిరాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పుష్కరాల నిర్వహణలో మంత్రి నారాయణ అందరి మన్ననలు పొందారు. రెండోసారి పుష్కరాల నిర్వహణ బాధ్యత మంత్రి నారాయణ తీసుకున్నారు. కామన్ గుడ్ ఫండ్స్‌తో నెల్లూరులో ఆలయాలను పునర్నిర్మిస్తున్నాము.

మంత్రి నారాయణ పాయింట్స్:


సిటీలోని ఐదు ఆలయాల అభివృద్ధికి 25 కోట్లు కేటాయించిన మంత్రి ఆనంకు కృతజ్ఞతలు. గత ప్రభుత్వం దేవాలయ వ్యవస్థను సర్వనాశనం చేసింది.

దూప దీప నైవేద్యాలకు 10 వేలు ఆల యానికి కేటాయించిన ఘనత సీఎం చంద్రబాబుది. గోదావరి పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తాము. ఉత్తర శ్రీరం గంగా విరాజిల్లుతున్న శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థాన కీర్తిని మరింత ఇనుమడింపజేయడమే మా లక్ష్యం. పదవిని బాధ్య తగా భావించి సభ్యులు పనిచేస్తారని భావిస్తున్నా. భగవంతుడి సేవలో తరించి ఆలయ ప్రతిష్టను మరింత పెంచుతారని ఆకాం క్షిస్తున్నా. సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని సూచిస్తున్నా.

భక్తుల ఆకలి తీర్చేందుకు ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం పక్కాగా నిర్వహిస్తాం. భక్తుల సౌకర్యార్థం ఒక శాశ్వత అన్నదాన భవనాన్ని నిర్మించబోతున్నాం. కళ్యాణ మండపానికి వచ్చే వారి కోసం ప్రత్యేకంగా డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆలయ వైభవానికి ప్రతీకగా నిలిచే పడమర రాజగోపురాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా పునఃనిర్మిస్తాం. అద్భుతమైన అద్దాల మండపాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించి భక్తులకు అందుబాటులోకి తెస్తాం. భక్తుల రద్దీకి తగ్గట్టుగా మహాప్రాకారం మరియు వాహనాల పార్కింగ్ కోసం వాహనశాల నిర్మిస్తాం. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే పెన్నా ఘాట్‌ను ఆధునీకరించి సుందరీకరిస్తాం. ఈ అభివృద్ధి పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసే బాధ్యతను ధర్మకర్తల మండలికి అప్పగించాం. అందరి సహకారంతో ఈ దేవస్థానాన్ని అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం.

బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, జనసేన నగర అధ్యక్షులు సుజయ్ బాబు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మంత్రి తాళ్ళపాక రమేష్ రెడ్డి దంపతులు, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు దంప తులు, ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపు రెడ్డి సురేష్ రెడ్డి, నారాయణ విద్యాసమస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, కూటమి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# బాలాజీ నగర్‌లో వైభవంగా శ్రీవారి కళ్యాణం..పాల్గొన్న మంత్రి నారాయణ









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని 14వ డివిజన్ బాలాజీ నగర్‌లో నిర్వహించిన శ్రీనివాస కల్యాణంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా విరామం లేకుండా ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వికాస్ ప్రజాహిత సేవా సమితిని, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్న సంస్థ వ్యవస్థాపకులు స్థానిక కార్పొరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కేవలం భక్తి కార్యక్రమాలకే పరిమితం కాకుండా, సమాజం కోసం శ్రమించిన 1500 మంది రిటైర్డ్ ఉద్యోగులను, ఇతర రంగాల ప్రముఖులను సన్మానించడం అభినందనీయమన్నారు. వృద్ధులకు, సేవకులకు ఇలా గుర్తింపునివ్వడం ద్వారా యువతకు మంచి సందేశం అందుతుందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావడం గొప్ప విషయమన్నారు. స్వామివారి ఆశీస్సులు నెల్లూరు ప్రజలం దరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ పట్టాభి రామిరెడ్డి, మాజీ మునిసిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతా రెడ్డి, వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# మీ దగ్గరకొచ్చే చేనేత వస్త్రాలు కొంటాం

**- సహకార సంఘాలతో మంత్రి సవిత - నాణ్యమైన వస్త్రాలనే ఆప్కోకు విక్రయించండి - ట్రెండ్‌కు తగ్గట్లు వస్త్రాలు నేయండి - నేతన్నల స్కిల్ పెంచేలా శిక్షణిస్తాం - చేనేతల రెట్టింపు ఆదాయమే కూటమి లక్ష్యం - 23 నెలల కాలంలో ఆప్కో ద్వారా రూ.190 కోట్ల వస్త్రాల విక్రయం - రాబోయే మహానాడులో ప్రత్యేక చేనేత స్టాళ్లు ఏర్పాటు - ఆప్కోకు తొలిసారి టీటీడీ ఆర్డర్ - చేనేతల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం - త్వరలో నేతన్న భరోసాకు శ్రీకారం : మంత్రి సవిత**






**అమరావతి, (రాజధాని వార్తలు):** నేతన్నలకు రెట్టింపు ఆదాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వారికి ఆర్థిక మేలు కలిగేలా చేనేత సహకార సంఘాల చెంతకు వచ్చి చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఇండెంట్‌లో పేర్కొన్న నాణ్యమైన వస్త్రాలనే ఆప్కోకు విక్రయించాలని, ఆ సంస్థను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, ఇప్పటికే ఉచిత విద్యుత్ అందజేశామని తెలిపారు. చేనేతల ఆరోగ్య రక్షణకు యూనివర్సల్ హెల్త్ పాలసీని తీసుకొస్తున్నామని, నేతన్న భరోసా పథకం ద్వారా రూ.25 వేల ఆర్థిక సాయం అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో మంత్రి సవిత సోమవారం భేటీ అయ్యారు. చేనేత సహకార సంఘాల నుంచి చేనేత వస్త్రాల కొనుగోలు, ఇతర సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేనేతల బాగు కోరే ప్రభుత్వం తమదన్నారు. చేనేత కళాకారులు కాలరు ఎగరేసేలా బతకాలన్నది సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. 365 రోజులూ చేనేతలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 23 నెలల కాలంలో ఆప్కో ద్వారా రూ.190 కోట్ల అమ్మకాలు చేశామన్నారు. ఆప్కో షో రూముల్లో అమ్మకాలు పెంచడానికి సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా నేతన్నల కుటుంబాలకు ఎంతో మేలు కలుగుతోందన్నారు. 90 శాతం సబ్సిడీతో మగ్గం పనిముట్లు అందజేస్తున్నామని, నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. నేతన్నలకు రెట్టింపు ఆదాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత వెల్లడించారు.

**రాబోయే మహానాడులో చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు**

చేనేత అమ్మకాలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నామని, సోషల్ మీడియాలో విస్తృతం ప్రచారం చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు చేస్తున్నామని, 6,770 చేనేత ఉత్పత్తులను 40 ఆప్కో షో రూమ్‌ల ద్వారా ఈ కామర్స్ ద్వారా విక్రయిస్తున్నామని వెల్లడించారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని, వాటికి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్లకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. గతేడాది నిర్వహించిన మహానాడు సహా టీటీడీ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరులో జరిగే మహానాడు సందర్భంగా చేనేత ఎగ్జిబిషన్ స్టాళ్లు ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

**నాణ్యమైన వస్త్రాలనే ఆప్కోకు విక్రయించండి...**

చేనేతలకు ఆర్థిక మేలు కలిగేలా చేనేత సహకార సంఘాల చెంతకు వచ్చి చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తామని మంత్రి సవిత స్పష్టంచేశారు. చేనేత వస్త్రాలను ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తామన్నారు. చేనేత అధికారులు స్వయంగా సహకార సంఘాల వద్దకు వచ్చి వస్త్రాలను కొనుగోలు చేస్తారన్నారు. అధికారులు ఇచ్చిన ఇండెంట్‌ను దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన వస్త్రాలను, ప్రస్తుత తరం అభిరుచులకు అనుగుణంగా చేనేత వస్త్రాలను తయారు చేసి ఆప్కోకు విక్రయించాలన్నారు. ఆప్కోను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు నేతన్నలపైనా ఉందన్నారు. చేనేత రెడీమేడ్ వస్త్రాలను తయారు చేయాలని, ఇందుకు అవసరమైన శిక్షణ అందించడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని వెల్లడించారు.

**ఆప్కోకు తొలిసారి టీటీడీ ఆర్డర్**

ఆప్కో చరిత్రలో తొలిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.20 కోట్లకు పైబడి ఆర్డర్ వచ్చినట్లు మంత్రి సవిత తెలిపారు. కండువాలు, దుశ్శాలువాలు, చీరలు, దుప్పట్టాలు, బ్లౌజ్ లను టీటీడీకి అందజేయాల్సి ఉంటుందన్నారు. ఆ వస్త్రాలపై శంకు చక్రాలతో పాటు ఓం నమో వెంకటేశాయ అని ముద్రించాలన్నారు. ఆసక్తి కలిగిన ముందుకొస్తే, టీటీడీకి వస్త్రాలను తయారు చేసే అవకాశమిస్తామని మంత్రి సవిత తెలిపారు. చేనేత వస్త్రాలను ధరించేలా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారన్నారు.

నేతన్నల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. నేతన్న భరోసా పథకం కింద రూ.25 వేల ఆర్థిక సాయం అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ, నాణ్యమైన వస్త్రాలను మాత్రమే ఆప్కోకు విక్రయించాలని స్పష్టం చేశారు. కమిషనర్ రేఖారాణి మాట్లాడుతూ, చేనేత అమ్మకాలు పెంచేలా మరిన్ని ఎగ్జిబిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ జిల్లాలకు చెందిన చేనేత సహకార సంఘాల ప్రతినిధులు తీసుకొచ్చిన చేనేత వస్త్రాలను మంత్రి సవిత పరిశీలించారు. వాటి ధరలతో పాటు ఏయే ప్రాంతాల నుంచి తీసుకొచ్చారో అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన చేనేత సహకార సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉచిత విద్యుత్ పథకం అందజేసినందుకు కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రులు నారా లోకేశ్, సవితకు ధన్యవాదాలు తెలియజేశారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan